కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ : సోమవారం 26 ఆగస్టు 2024
సంపుటి: 14, సంచిక: 143, పేజీలు 7, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## యువత రాజకీయాల్లోకి రావాలి

తెలుగు భాష
అద్భుతమైనది
మన్ కీ బాత్‌లో
తెలుగు భాష దినోత్సవ
శుభాకాంక్షలు
తెలిపిన ప్రధాని



2



2

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

**తమిళనాడులో 14 వాహనాలు ధ్వంసం**



### హిజ్బుల్లా స్థావరాలపై...
# ఇజ్రాయెల్ భీకర దాడులు

**100 యుద్ధ విమానాలు రాకెట్ లాంచర్లతో విధ్వంసం**

**ఇజ్రాయిల్ పై దాడులకు సిద్ధమైన లెబనాన్‌లోని హిజ్బుల్లా**

**ముందే పసిగట్టి దాడులకు దిగామన్న ఇజ్రాయిల్ సైన్యం**

**ఇజ్రాయెల్ ఆగస్టు 25 (నిఘా న్యూస్):** పశ్చిమాసియాలో మరోసారి పరిస్థితులు తీవ్రరూపుదాల్చాయి. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా ఉగ్రసంస్థ పరస్పరం దాడులు ప్రతిదాడులకు దిగాయి. ఆదివారం తెల్లవారుజామున దక్షిణ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై వరుస క్షిపణులతో ఇజ్రాయెల్ మెరుపుదాడి చేసింది. వంద యుద్ధ విమానాలు, 40 రాకెట్లు, క్షిపణులతో హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. ఈ విషయాన్ని ఇరు దేశాలు ధ్రువీకరించాయి. హెజ్‌బొల్లా తమపై వేలాది రాకెట్లతో భారీ దాడికి సిద్ధమైందని దీన్ని ముందే గుర్తించి తాము దాడి చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. దాదాపు 6 వేల రాకెట్లు, డ్రోన్లతో హెజ్‌బొల్లా దాడికి సిద్ధమైనట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. ఆత్మ రక్షణలో భాగంగానే ముందస్తు దాడులు చేసినట్లు పేర్కొంది. అక్టోబర్ 7 ఘటనకు మించి అతిభారీ విధ్వంసానికి సిద్ధమైన హెజ్‌బొల్లా కుట్రను భగ్నం చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. తమ సైన్యానికి చెందిన 100 యుద్ధ ..మిగతా 2లో

### చెరువులు చెర బట్టిన వారి...
# భరతం పడతాం

**ప్రకృతి సంపదను విధ్వంసం చేస్తే అది మన మీద కక్ష కడుతుంది**



నిర్దాక్షిణ్యంగా అక్రమ నిర్మాణాలకు కూల్చివేత

- చెరువులే మానవాళికి జీవనాధారం
- బఫర్ జోన్‌లోని నిర్మాణాల మురికి నీటిని చెరువుల్లోకి వదులుతున్నారు
- ఆ నీటిని కోట్లాది మంది నగర ప్రజలు తాగుతున్నారు
- రాజకీయాలకు అతీతంగా చెరువులను కాపాడుకుందాం
- చెరువుల రక్షణతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం
- భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా హెరిటేజ్ టవర్
- అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా 22 లక్షల విద్యార్థులకు భోజనం
- అనంత శేష స్థాపన ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

## కూల్చివేతలపై హైడ్రా నివేదిక

**లిస్టులో ప్రముఖులకు చెందిన నిర్మాణాలు**

2

**హైదరాబాద్ ఆగస్టు 25 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంత ఒత్తిడి ఉన్నా వెనక్కి తగ్గకుండా అక్రమ నిర్మాణాలు కూలగొడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీకృష్ణ భగవానుడి బోధన అనుసారం చెరువులను కాపాడుతున్నామని తెలిపారు. చెరువులను చెరబట్టిన వాళ్ల నుంచి వాటిని విముక్తి చేయాలనుకున్నామని వెల్లడించారు. శ్రీకృష్ణ భగవానుడి బోధన అనుసారం చెరువులను కాపాడేందుకు అక్రమ నిర్మాణాలు కూలగొడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తమపై ఎంత ఒత్తిడి ఉన్నా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగుతున్నామని చెప్పారు. హైదరాబాద్ మహానగరంలో చెరువులను చెరబట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని వెల్లడించారు. కోకాపేట్ లోని అక్షయ పాత్ర ఫౌండేషన్ సమీపంలో హరే కృష్ణ హెరిటేజ్ టవర్ ఆధ్వర్యంలో అనంత శేష స్థాపన ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెరువులు మనవాళికి జీవనాధారమన్న రేవంత్ రెడ్డి, కొందరు శ్రీమంతులు వాటిలో ఫామ్‌హౌజ్‌లు నిర్మించారని అసహనం వ్యక్తం చేశారు. అక్రమార్కుల నుంచి చెరువులను విముక్తి చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలు చేసిన వ్యక్తులు ప్రభుత్వాన్ని ప్రభావితం ..మిగతా 2లో

### యూపీఎస్‌లో యూ అంటే
## మోదీ సర్కార్ యూటర్న్: ఖర్గే



న్యూఢిల్లీ, ఆగస్టు 25 (నిఘా న్యూస్): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీఎస్‌లో యూ అంటే మోదీ సర్కార్ యూటర్న్‌లని ఖర్గే అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం మోదీ సర్కార్ తీసుకున్న ..మిగతా 2లో

### ఏపీలో 8 మంది ప్రొబేషనరీ
## ఐఏఎస్‌లకు పోస్టింగ్




అమరావతి, ఆగస్టు 25 (నిఘా న్యూస్): ఎనిమిది మంది ప్రొబేషనరీ ఐఏఎస్‌లకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్కాపురం డివిజన్ సబ్ కలెక్టర్‌గా వెంకట్ త్రివినాగ్, పాలకొండ-యశ్వంత్ కుమార్ రెడ్డి, నర్సీపట్నం-కేఆర్ కల్పశ్రీ, పెనుకొండ-మౌర్య భరద్వాజ్, గూడూరు- రాఘవేంద్రమీనా, ..మిగతా 2లో

### బీహార్ ఎన్నికల్లో
## జన్ సూరజ్ పోటీ: ప్రశాంత్ కిశోర్



బీహార్ ఆగస్టు 25 (నిఘా న్యూస్): ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఇప్పటికే జన్ సూరజ్ పేరుతో రాజకీయ పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 2న పార్టీని ప్రారంభించనున్నారు. జన్ సూరజ్ పార్టీ 2025లో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ..మిగతా 2లో

# ఆన్‌లైన్‌లో టీడీపీ సభ్యత్వం

**తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి ఎంపికపై చర్చ.. ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు సమీక్ష**




**హైదరాబాద్ ఆగస్టు 25 (నిఘా న్యూస్)** 2047 కల్లా ప్రపంచంలో తెలుగువారు అగ్రస్థానంలో ఉండాలనే ఆలోచనతోనే నిరంతరం పనిచేస్తున్నానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతంపై ముఖ్యనేతలతో చంద్రబాబు చర్చించారు. తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి ఎంపికపైనా చర్చించినట్లు తెలుస్తోంది. 2047 వందేళ్ల స్వాతంత్ర్య వేడుకల్లో భారత్ అగ్రస్థానంలో ఉండాలని, అందులో తెలుగు రాష్ట్రాలు మొదటి స్థానంలో ఉండేలా కృషి చేయాలి సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలంగాణాలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ క్రమంలో తెలంగాణాలో ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వం తీసుకొనే ఏర్పాటు చేస్తామని ..మిగతా 2లో



## ఏపీలో స్పేస్ కిడ్జ్ ఏర్పాటుపై చర్చలు

**యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యం**

**పవన్ కళ్యాణ్‌తో సంస్థ ప్రతినిధుల చర్చలు**

2




### మహిళలపై నేరాలు...
# క్షమించరాని పాపం

**దోషులను విడిచి పెట్టకూడదు: మోదీ**

**న్యూఢిల్లీ ఆగస్టు 25 (నిఘా న్యూస్)** మహిళలపై నేరాలకు పాల్పడడం క్షమించరాని పాపమని, దోషులను విడిచిపెట్టకూడదని ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల గౌరవాన్ని కాపాడడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. మహారాష్ట్రలో లఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ, దేశంలో నారీమణులపై పెరుగుతున్న ఆకృత్యాలపై అసహనం వ్యక్తం చేశారు. దేశంలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడడం క్షమించరాని పాపమని, దోషులను విడిచి పెట్టకూడదని తెలిపారు. మహిళల భద్రతకు దేశం ప్రాధాన్యం ఇవ్వాలని వ్యాఖ్యానించారు. ఉత్తర మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరిగిన లఖ్‌పతీ దీదీ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

**'మహిళలకు గత ప్రభుత్వాల కంటే చాలా ఎక్కువ చేశాం'**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ..మిగతా 2లో

## ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేస్తే సహించేది లేదు

**తప్పు చేసిన ఎవరిని క్షమించను**
**కొంతమంది అధికారుల తీరు సిగ్గుపడేలా ఉంది**
**అన్ని శాఖల వారీగా నేను కాదు అధికారులకు**
**మంత్రి పొంగులేటి వార్నింగ్**



2

### విశాఖ రైల్వే జోన్‌కు
## చురుకుగా ఏర్పాట్లు

**ముడసర్లోవ వద్ద 52 ఎకరాల ప్రభుత్వ భూమికి క్లియరెన్స్**

**2019 సెప్టెంబరులో డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం**




విశాఖ. ఆగస్టు 25 (నిఘా న్యూస్): విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు విషయంలో మళ్లీ కదలిక వచ్చింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినా.. ఇదిగో జోన్.. అదిగో జోన్ అని అంటున్నారు తప్పా.. కార్యరూపం ..మిగతా 2లో



## చెరువులు చెర బట్టిన వారి...
# భరతం పడతాం

**మొదటి పేజీ తరువాయి...**

చేసిన స్థాయిలో ఉండొచ్చని అన్నారు. ప్రకృతి సంపదను విధ్వంసం చేస్తే అది మనమీద కక్ష కడుతుందని పేర్కొన్నారు. విద్యా, వైద్యం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతనిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**తెలంగాణకు కోకాపేట ఆర్థిక క్షేత్రం**

భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ధ్యాన కేంద్రాన్ని నిర్మిస్తున్నారని నిర్వాహకులను సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. స్థలదాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. సమాజంలో వ్యక్తులకు స్ఫూర్తినిచ్చేలా హెరిటేజ్ టవర్ నిర్మాణం జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హెరిటేజ్ టవర్ నిర్మాణం 36 నుంచి 42 నెలల్లో పూర్తవుతుందని ఆశిస్తున్నామన్నారు. హెరిటేజ్ టవర్ ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు కోకాపేట్ ఆర్థికక్షేత్రం అని అభివర్ణించారు. హెరిటేజ్ టవర్ నిర్మాణానికి అగర్వాల్ ఆరు ఎకరాలు భూదానం చేశారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా 22 లక్షల స్కూళ్లకు భోజనం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న చెరువులు అన్యాక్రాంతం కాకుండా సీఎం చేస్తున్నారని కొనియాడారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న గొప్ప కార్యక్రమానికి పెద్దల ఆశీర్వాదాలు ఉండాలని శ్రీధర్‌బాబు అకాంక్షించారు.

## యూపీఎస్‌లో యూ అంటే మోదీ సర్కార్ యూటర్న్: ఖర్గే

**మొదటి పేజీ తరువాయి...**

పలు కీలక నిర్ణయాలను మళ్లీ వెనక్కితీసుకోవడం వెనుక విపక్షాల విమర్శల దాడి ఉందని పేర్కొన్నారు. జూన్ 4 తర్వాత ప్రజల శక్తి ప్రధాని అహంకారంపై విజయం సాధించిందని చెప్పారు. లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్‌పై వెనక్కితగ్గడం, వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపడం, బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు ముసాయిదా ఉపసంహరణ, అధికార యంత్రాంగంలో లేటరల్ ఎంట్రీ రద్దు వంటి ఎన్నో నిర్ణయాలను మోదీ ప్రభుత్వం ఇటీవల వెనక్కితీసుకుందని ఖర్గే గుర్తుచేశారు. ఈ నియంతృత్వ ప్రభుత్వం నుంచి తాము 140 కోట్ల మందిని కాపాడుతున్నామని, ప్రభుత్వంలో జవాబుదారీతనాన్ని తీసుకొచ్చామని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్‌కు భరోసా ఇచ్చే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్కు కేంద్ర క్యాబినెట్ శనివారం ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. యుపిఎస్‌ని ఎంచుకునే ఉద్యోగులు 25 సంవత్సరాల కనీస సర్వీసుతో సూపర్‌యాన్యుయేషన్‌కు ముందు గత 12 నెలల్లో డ్రా చేసిన సగటు ప్రాథమిక వేతనంలో 50 శాతం హామీ ఇవ్వబడిన పెన్షన్ పొందేందుకు అర్హులు.

## బీహార్ ఎన్నికల్లో జన్ సూరజ్ పోటీ: ప్రశాంత్ కిశోర్

**మొదటి పేజీ తరువాయి...**

పోటీ చేస్తుందని ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. 243 స్థానాల్లో పోటీ చేస్తుందని కనీసం 40 మంది మహిళా అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. 2030 నాటికి 70 నుంచి 80 మంది మహిళా నేతలను జన్ సూరజ్ నాయకురాళ్లుగా తీర్చిదిద్దుతామని ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రకటించారు. మహిళా సెల్ సమావేశంపై ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ ఇది మహిళా సెల్ సమావేశం కాదని ఇది నిజమైన అర్థం మహిళా నాయకులను చేసే ప్రయత్నమన్నారు. మహిళలు జీవనోపాధికి నాలుగు శాతం గ్యారంటీతో రుణాలు పొందాలని అందుకే మహిళలను గెలిపించి అసెంబ్లీకి పంపుతామనేది జన్ సూరజ్ ప్రచారమన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం కొలువుదీరితే 10-12వేల ఉద్యోగాల కోసం బిహార్‌ను విడిచిపెట్టమని ఎవరూ బలవంతం చేయరన్నారు. ఇందుకోసం పూర్తిగా బ్లూప్రింట్‌ని సిద్ధం చేశామన్నారు. బిహార్ అభివృద్ధిపై ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ చేసిన వ్యాఖ్యలపై ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ కులం, దోపిడీ, మద్యం మాఫియా, నేరాలపై తేజస్వీ యాదవ్ కామెంట్స్ చేయవచ్చని అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఆయనకు జీడీపీ, జీడీపీ వృద్ధి అంటే ఏమిటో తెలియదని విమర్శించారు. ఆరు నెలల కిందట తేజస్వి యాదవ్ డిప్యూటీ సీఎంగా ఉన్న సమయంలో బీహార్ అభివృద్ధి కథ గురించి ఆయన మాట్లాడుతున్నారు. మహా ఘటబంధన్‌లో నితీశ్ కుమార్ ఉండి ఉంటే, బిహార్‌లో ఆయనకు అంతా మంచే కనిపించేదంటూ సెటైర్లు వేశారు.

## మహిళలపై నేరాలు...
# క్షమించరాని పాపం

**మొదటి పేజీ తరువాయి...**

మహిళలకు గత ప్రభుత్వాలు చేసిన దానికంటే, గత పదేళ్లలో ఎన్‌డీఏ సర్కార్ నారీమణుల కోసం చాలా చేసిందన్నారు ప్రధాని మోదీ. 2014 వరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.25 కోట్లలోపే రుణాలు ఇచ్చారని, అయితే గత 10 ఏళ్లలో రూ.9 లక్షల కోట్ల సాయం అందించామని వెల్లడించారు. లఖ్‌పతీ దీదీ పథకం కేవలం మహిళల ఆదాయాన్ని పెంచడమే కాక, భవిష్యత్తు తరాలకు సాధికారత చేకూర్చేదని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో జల్గావ్‌లో లఖ్‌పతీ దీదీలతో సంభాషించారు ప్రధాని మోదీ. అలాగే 4.3 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 48 లక్షల మంది సభ్యులకు లబ్ధి చేకూర్చే రూ.2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. మహిళలు ఇల్లు, కుటుంబాన్ని ముందుండి నడిపిస్తారు. అయితే మహిళలకు సాయం చేయడానికి గత ప్రభుత్వాలేవీ ముందుకు రాలేదు. మహిళల పేరు మీద ఆస్తులు లేవని, బ్యాంకులో రుణం పొందలేక పోయేవారు. అందుకే నేను మీ కొడుకు, సోదరుడిగా మహిళా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటున్నాను. గత పదేళ్లలో కోటి మంది లఖ్‌పతీ దీదీలను తయారు చేశాం. మహారాష్ట్ర భవిష్యత్, శ్రేయస్సు కోసం బీజేపీ నేతృత్వంలోని మహాయుతి సర్కార్ రాష్ట్రంలో మరిన్ని ఏళ్లు పాలనలో ఉండాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి చెందిన భారత్‌లో మహారాష్ట్ర ఒక ప్రకాశించే నక్షత్రం. రాష్ట్ర ప్రజలంటే పోలండ్ దేశస్థులకు చాలా గౌరవం. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పోలాండ్ శరణార్థులకు మరాఠీ ప్రజలు అండగా నిలిచారు. అందుకే పోలాండ్ దేశస్థులు ఇప్పటికీ మహారాష్ట్ర ప్రజలను గౌరవిస్తారని ప్రధాని మోదీ తెలిపారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

**తెలుగు భాష అద్భుతమైనది**
**మన్ కీ బాత్‌లో తెలుగు భాష దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని**



**న్యూఢిల్లీ ఆగస్టు 25 (నిఘా న్యూస్)** తెలుగు భాష ఒక అద్భుతమైన భాష అని ప్రధాని మోదీ కొనియాడారు. 113వ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈ నెల 29న (ఆగస్టు 29న) తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచంలోని తెలుగు మాట్లాడే వారందరికీ తెలుగుభాష దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆ భాగంగా ప్రధాని తెలుగు భాషా దినోత్సవం గురించి ప్రస్తావించారు. ఈ మేరకు తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు అంటూ ప్రధాని నరేంద్ర మోదీ తెలుగులో చెప్పారు. అంతరిక్ష రంగంలో కృషి చేస్తున్న పలువురు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో మోదీ ముచ్చటించారు. అంతరిక్ష రంగంలో భారత్ దూసుకెళ్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా స్పేస్ డే నిర్వహించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదే తొలి అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకొన్నామని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ తీసుకొచ్చిన అనేక సంస్కరణలతో యువత పెద్ద ఎత్తున లబ్ధి పొందినట్లు వెల్లడించారు. చంద్రయాన్ 3 చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ నిలిచిందని గుర్తుచేశారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశ పునాదులను పటిష్ఠం చేసే ఎన్నో విషయాలు 21వ శతాబ్దంలో జరుగుతున్నాయని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో పేర్కొన్నారు. ఎలాంటి నేపథ్యం లేని లక్ష మంది యువత రాజకీయాల్లోకి రావాలని ఎర్రకోట వేదికగా ఇచ్చిన పిలుపునకు విస్తృత స్పందన వచ్చిందని వెల్లడించారు. అభివృద్ధి చెందిన దేశం, బలమైన ప్రజాస్వామ్యం కోసం నేటి యువత ప్రజా జీవితంలోకి రావాలని పునరుద్ఘాటించారు. వ్యాఖ్యానించారు. పెద్ద సంఖ్యలో యువత రాజకీయాల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం హర్ ఘర్ తిరంగా ప్రచారం పెద్ద ఎత్తున చేపట్టామని మోదీ తెలిపారు. ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు ఆవిష్కరించినట్లు తెలియజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సామాజిక వేడుకగా మారిందని పేర్కొన్నారు. తన పిలుపు మేరకు దాదాపు ఐదు కోట్లకు పైగా మంది జాతీయ జెండాతో ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని అన్వేషించిన మొదటి దేశంగా భారత్ నిలిచిందన్నారు. చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా స్పేస్ డే నిర్వహించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తొలి అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించుకున్నామన్నారు.

## హిజ్బుల్లా స్థావరాలపై...
# ఇజ్రాయెల్ భీకర దాడులు

**మొదటి పేజీ తరువాయి...**



విమానాలు లెబనాన్‌లోకి చొచ్చుకెళ్లి అనేక రాకెట్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. తమపై దాడి చేసే వారిపై ప్రతిదాడి తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. దేశాన్ని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. దాదాపు 200 హెజ్‌బొల్లా స్థావరాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాల వెల్లడించాయి. ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా ఉగ్రవాద ముఠా విస్తృత స్థాయి దాడికి సిద్ధమవుతోందని ఇజ్రాయెల్ సైనిక అధికార ప్రతినిధి అడ్మిరల్ డేనియల్ హగారీ హెచ్చరించిన కాసేపటికే ఉత్తర ఇజ్రాయెల్‌లోని పౌరులను అప్రమత్తం చేస్తూ సైరన్లు మోగాయి. అటు తమ దేశ దక్షిణ ప్రాంతంలో దాడులు జరిగినట్లు పేర్కొంటూ లెబనాన్‌లోని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న తరుణంలో తమ పౌరులను లెబనాన్ అప్రమత్తం చేసింది. హెజ్‌బొల్లా స్థావరాల సమీపంలో ఉన్న పౌరులు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా ఉగ్రసంస్థ ప్రతిదాడులు చేసింది. 11 ఇజ్రాయెల్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని 320 కత్యూషా రాకెట్లను ప్రయోగించింది. బీరుట్‌లో తమ కమాండర్ ఫాద్ షుక్ర్ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై డ్రోన్లతో దాడులు చేసినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది.

**దేశంలో 48 గంటల పాటు ఎమర్జెన్సీ**

ఇజ్రాయెల్ సైనిక స్థావరాలు సహా గగనతల రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసినట్లు తెలిపింది. తమ తొలి విడత దాడి పూర్తయిందని హెజ్‌బొల్లా ప్రకటించింది. ఈ దాడులతో హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై అప్పుడప్పుడూ దాడులకు దిగిన హెజ్‌బొల్లా ఇప్పుడు నేరుగా యుద్ధంలోకి అడుగు పెట్టినట్లు స్పష్టమవుతోందని అంతర్జాతీయ మీడియా విశ్లేషించింది. తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్ ఇంటర్నేషనల్ విమానాశ్రయం పలు విమానాలను దారి మళ్లించింది. టేకాఫ్ కావాల్సిన మరికొన్నింటిని ఎక్కడికక్కడ నిలిపివేసింది. మరోవైపు తాజా సైనిక కార్యకలాపాలను ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణ మంత్రి యోవ్ గాలంట్ టెల్ అవీవ్‌లోని మిలిటరీ ప్రధాన కేంద్రం నుంచి పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దేశంలో 48 గంటల పాటు ఎమర్జెన్సీని ప్రకటించినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ ప్రకటించారు. తమ పౌరుల రక్షణే తమకు తొలి ప్రాధన్యమని తెలిపారు.
ఈ దాడులు గురించి అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్ రక్షణకు తాము కట్టుబడి ఉన్నట్లు ఆస్టిన్ హామీ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నట్లు చెప్పారు. టెల్ అవీవ్ ఆత్మరక్షణ హక్కును కాపాడుకునేందుకు తాము సహకరిస్తామని పేర్కొన్నారు. మరోవైపు హెజ్‌బొల్లాతో దాడులు మొదలైనా ఇజ్రాయెల్ నిఘా సంస్థలైన మొస్సాద్, షిన్‌బెట్ చీఫ్‌లు కైరోలో బందీల విడుదల చర్చలకు వెళ్లారు. అమెరికా ఒత్తిడి కారణంగానే ఈ సమావేశానికి వెళ్లినట్లు తెలుస్తోంది.

# కూల్చివేతలపై హైడ్రా నివేదిక



**హైదరాబాద్ ఆగస్టు 25 (నిఘా న్యూస్)** హైదరాబాద్ మహా నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై ప్రభుత్వానికి హైడ్రా నివేదిక సమర్పించింది. ఇప్పటి వరకు 18 ప్రాంతాల్లో చెరువులు, నాలాలు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలు కూల్చివేసి 43 ఎకరాల 94 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా వెల్లడించింది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులకు చెందిన అక్రమ నిర్మాణాలతో పాటు సినీ, క్రీడా ప్రముఖులు చెందిన అనధికారిక నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా స్పష్టం చేసింది. రాష్ట్ర రాజధానిలో సంచలనంగా మారిన హైడ్రా, అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కు స్థలాలను కబ్జా చేసిన వారిపై కన్నెర్ర చేస్తూ అక్రమ నిర్మాణాలను నేలకూలుస్తోంది. ఈ క్రమంలో జూన్ 27 నంచి ఆగస్టు 24 వరకు కూల్చివేతలకు సంబంధించిన నివేదికను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి సమర్పించారు. ఇప్పటి వరకు 18 ప్రాంతాల్లో 166 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా వెల్లడించింది. రాజకీయ నేతల ఆక్రమణలు, తద్వారా కబ్జాదారుల నుంచి 43 ఎకరాల 94 గుంటల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి వివరించింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లతో పాటు పార్కు స్థలలాను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిలో పలువురు రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులున్నట్లు హైడ్రా ప్రభుత్వానికి నివేదించింది. చింతల్ చెరువులో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు రత్నాకరం సాయిరాజు అక్రమంగా నిర్మించిన 54 నిర్మాణాలను కూల్చివేసి 3 ఎకరాల 5 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే నందగిరి హిల్స్‌కు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మద్దతుతో ఆక్రమించిన పార్క్ స్థలంలోని 18 గుంటల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. బహదూర్‌పురా ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబిన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మిరాజ్ రెహమత్ బేగ్ రాజేంద్రనగర్ లోని బుమ్ రూఖ్‌దౌలా చెరువులో అక్రమంగా నిర్మించిన రెండు ఐదస్తుల భవనాలు, ఒకటి రెండస్తుల భవనంతోపాటు మరో భవనాన్ని కూల్చివేశామని హైడ్రా స్పష్టం చేసింది. ఇక్కడ మొత్తం 45 అక్రమ నిర్మాణాలు కూల్చివేసి 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్లు హైడ్రా ప్రభుత్వానికి తెలిపింది. ఇక గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఖానాపూర్, చిలుకూరు వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ యజమాని జీవీ భాస్కర్ రావు, మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సునీల్ రెడ్డి, ప్రోకబడ్డి యజమాని అనుపమలు ఆక్రమంగా నిర్మించిన 8 భవనాలు, 14 తాత్కాలిక షెడ్లు, 4 ప్రహరీలను కూల్చివేసినట్లు హైడ్రా వివరించింది. ఖానాపూర్, చిలుకూరు వద్ద గండిపేట ఎఫ్‌టీఎల్‌లోని 14 ఎకరాల 80 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా పేర్కొంది. అలాగే మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువులో అక్రమంగా నిర్మించిన ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించిన 2 నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా తెలిపింది. ఇక్కడ 4 ఎకరాల 9 గుంటల భూమి స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా పేర్కొంది. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన నిర్మాణాన్ని కూల్చివేసి 16 గుంటలు స్వాధీనం చేసుకున్నామని హైడ్రా తెలిపింది. అలాగే మన్సూరాబాద్‌లో 2 గుంటలు, ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో 6 గుంటలు, బంజారాహిల్స్ మిథిలా నగర్‌లో ఎకరా 4 గుంటలు, ఫిల్మ్‌నగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్‌ను కూల్చి వేసి 5 ఎకరాలు, గాజులరామారం మహాదేవపురం వద్ద ఒక గుంట స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా తెలిపింది. అలాగే గాజుల రామారాం భూదేవిహిల్స్‌లో ఎకరం ఒక గుంట, అమీర్‌పేటలో గుంట, చందానగర్ ఈర్ల చెరువులో అక్రమంగా నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం ఒకటి, నాలుగు అంతస్తుల భవనం రెండింటిని కూల్చివేసి 16 గుంటల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా తెలిపింది. బాచుపల్లి ఎర్రకుంటలో 29 గుంటలు, బోడుప్పల్ రెవెన్యూ భూమిలో 3 గుంటలు స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వానికి నివేదించారు.

# ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేస్తే సహించేది లేదు

**హైదరాబాద్ ఆగస్టు 25 (నిఘా న్యూస్)** రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో సమావేశ మయ్యారు సబ్ రిజిస్ట్రార్లు, డీఐజీలు, జాయింట్ డీజీలు, ఐజీ, అదనపు ఐజీ స్థాయీ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా సమావేశంలో రెవెన్యూ శాఖ అధికారులపై మంత్రి కోపడ్డారు. పలువురి అధికారుల పనితీరు బాలేదని మార్చుకోకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంపుపై సమావేశంలో చర్చ జరిగింది. ఉద్యోగుల సమస్యలు, బకాయిలతోపాటు పలు అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పలు అంశాలపై అధ్యయనం కోసం అధికారులు ఇటీవలే వివిధ రాష్ట్రాల్లో పర్యటించారు. వారు తెచ్చిన నివేదికలను మంత్రి పరిశీలించారు. "అధికారులు తప్పు చేస్తే క్షమించేది లేదు. రెవెన్యూ వ్యవస్థకు మంచి పేరు తీసుకురండి. మానవత్వంతో విధులు నిర్వహించండి. ఎవరిమీద నాకు కోపం లేదు. ప్రభుత్వం స్థలాన్ని పేదవాడికి ఇవ్వాలి. ప్రభుత్వ భూములను బడాబాబులకు రిజిస్ట్రేషన్ చేస్తే ఎంతటి వారినైనా సహించేదిలేదు. అన్ని శాఖల వారీగా నిరంతరం సమీక్ష నిర్వహిస్తుంటా. పదోన్నతుల విషయంలో ఎవరి ప్రమేయంగానీ, పైరవీలుగానీ అవసరం లేదు. అన్ని నేనే చూసుకుంటా. అన్ని శాఖల వారిలా నేను కాదు చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాను. రెవెన్యూ శాఖలో కొందరు అధికారుల తీరుపై సిగ్గుపడుతున్నా. రాబోయే రోజుల్లో అధికారులంతా తలెత్తుకునేలా చేస్తా. ప్రమోషన్ల కోసం రాజకీయ నాయకుల మద్దతు తీసుకొచ్చినా వృథా ప్రయాసే. మీ రాజకీయ నాయకుడికి సంబంధించిన లేఖ తీసుకొస్తే నవ్వుతా. ఎవరైతే ఈ శాఖకు మంచి పేరు తెస్తే వాళ్ళని గుర్తిస్తా. తెలిసి తెలియన్నట్టు నటిస్తే సీరియస్ యాక్షన్ తీసుకుంటా" అని మంత్రి పొంగులేటి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.



## రోడ్డు ప్రమాదంలో
# ఐదుగురు మృతి

**హెూసూరు ఆగస్టు 25 (నిఘా న్యూస్)** తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లా హెూసూరు సమీపంలోని పేరండ్లపల్లి వద్ద జాతీయ రహదారి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు హైవేపై నమ్మశక్యం కాని రీతిలో వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 8 కార్లు, రెండు బస్సులు, 4 లారీలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. మరో 10 మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హెూసూరు, క్రిష్ణగిరి ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులలో పలువురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది. బెంగళూరు-క్రిష్ణగిరి మార్గంలోని హెూసూరు సమీపంలోని పేరండ్లపల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. బెంగళూరు-క్రిష్ణగిరి హైవే పై ఇరువైపులా కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ అయింది. గ్రానైట్‌తో వెళుతున్న లారీ బ్రేక్ ఫెయిల్ అయ్యి కారుని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ వెనకే వస్తున్న పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. మొత్తం 15 వాహనాలు ఢీకొనగా.. 14 వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.



## ఏపీలో స్పేస్ కిడ్జ్
# ఏర్పాటుపై చర్చలు

**యువ శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యం**
**పవన్ కళ్యాణ్‌తో సంస్థ ప్రతినిధుల చర్చలు**

**విజయవాడ ఆగస్టు 25 (నిఘా న్యూస్)** శాస్త్ర, సాంకేతిక రంగం అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అమరావతిలో స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులతో పవన్ కళ్యాణ్ సమావేశమై అంతరిక్ష రంగంలో సంస్థ చేసిన పరిశోధనల గురించి తెలుసుకున్నారు. స్పేస్ కిడ్జ్ సంస్థ పరిశోధనలు, తయారు చేసిన శాటిలైట్ల గురించి డిప్యూటీ సీఎంకు సంస్థ ప్రతినిధులు వివరించారు. ఇటీవల తయారుచేసిన అతి చిన్న శాటిలైట్ డిప్లయర్‌ను పవన్ కళ్యాణ్‌కు చూపించి, దాని పని విధానం, ఉపయోగాలను వివరించారు. పిల్లల్లో దాగిఉన్న అపరిమితమైన ఊహాశక్తిని వెలికి తీసి వారిని శాస్త్రవేత్తలుగా తయారుచేయడమే లక్ష్యంగా స్పేస్ కిడ్జ్ సంస్థ పనిచేస్తుంది. విద్యార్థి దశలోనే శాస్త్ర, సాంకేతిక రంగాలపై మక్కువ పెంచడమే ఈ సంస్థ లక్ష్యం. ముఖ్యంగా అంతరిక్ష పరిశోధనవైపు విద్యార్థులు మళ్లించే ఉద్దేశంతో సంస్థ పనిచేస్తుంది. దేశంలో యువ శాస్త్రవేత్తలను తయారుచేయడమే లక్ష్యంగా స్పెస్ కిడ్జ్ సంస్థ పనిచేస్తోంది. ముఖ్యంగా పలు ఉపగ్రహాలను ఈ సంస్థ అభివృద్ధి చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో సంస్థ కార్యకలాపాలను విస్తృతం చేసే లక్ష్యంతో స్పెస్ కిడ్జ్ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిశారు.

## ఆన్‌లైన్‌లో టీడీపీ సభ్యత్వం

**మొదటి పేజీ తరువాయి...**

సీఎం చంద్రబాబు అన్నారు. అంతే కాకుండా తెలంగాణాలో యువకులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. 15 రోజులకు ఒకసారి రాష్ట్రానికి వచ్చేందుకు ప్రయత్నిస్తానని అందరినీ కలిసి అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఏపీలో 8 మంది ప్రొబేషనరీ ఐఏఎస్‌లకు పోస్టింగ్

**మొదటి పేజీ తరువాయి...**

పాడేరు-శౌర్యమాన్ పటేల్, కందుకూరు-తిరుమణి శ్రీపూజ, తెనాలి డివిజన్ సబ్‌కలెక్టర్‌గా సం జనా సిన్హాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# దళారుల గుప్పిట్లో ఎమ్మార్వో కార్యాలయం

## ప్రతి పనికి లంచం అడుగుతున్న వైనం

**అంబర్ పేట, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):** అంబర్ పేట మండల కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు,సిబ్బంది పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.పబ్లిక్ సర్వేట్లుగా విధులు నిర్వహిస్తున్న ఇక్కడి అధికారులు, సిబ్బంది ప్రజలకు కావలసిన పనులు చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈ మండల కార్యాలయంలో పనిచేసే కొందరు ఆర్ఐలు, సర్వేయర్, ఇతర సిబ్బంది ప్రభుత్వ భూముల పరిరక్షణను గాలికి వదిలేసి, సొంత ఆదాయాన్ని పెంచుకునే దిశగా పనిచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసిన వారితో ఇక్కడి అధికారులు న్యాయస్థానాల్లో కౌంటర్లు దాఖలు చేయిస్తూ జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా భవన నిర్మాణానికి సంబంధించి జిహెచ్ఎంసి అనుమతి ఇస్తుంది. కాకపోతే ఆ భూమికి సంబంధించి ఎన్ఓసి మాత్రం రెవెన్యూ శాఖ ఇవ్వాల్సి వస్తుంది. ఇదే అదనుగా ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ఏరియాను బట్టి గజానికి వెయ్యి నుంచి పదివేల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా ఏరియాలో అక్రమ బోర్ లు వేసి వారి నుండి రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రెండు వేల నుంచి ఐదు వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఈ మండల కార్యాలయంలో దళారులు తిష్ట వేసి ఇక్కడి అధికారులకు డబ్బులు ముట్ట చెప్పి చిటికెలో పని చేయిస్తున్నట్లు




ఆరోపణలు వస్తున్నాయి. ఈ మండల కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సైతం దళారులను సంప్రదించి పనులు చేయించుకోమంటూ ఉచిత సలహాలు ఇవ్వడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో పలువురు దళారులు అడిగినన్ని డబ్బులు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. కొందరు నేరుగా పనుల కోసం దరఖాస్తు చేస్తే ఇక్కడ సిబ్బంది చుక్కలు చూపిస్తున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు సిబ్బంది అడిగినన్ని డబ్బులు ఇస్తేనే అంతా సక్రమంగా ఉందని రాస్తున్నారని, లేకుంటే ముప్పు తిప్పలు పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అంబర్ పేట మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బందిపై వస్తున్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే 8 నెలల క్రితం ఓ స్థల విషయమై యజమాని నుండి 10 లక్షల రూపాయల లంచం డిమాండ్ చేసి, లక్షన్నర రూపాయలు తీసుకుంటున్న సర్వేయర్ లలిత, స్పెషల్ ఆర్ఐ శోభ, వారికి సహకరించిన ప్రైవేట్ వ్యక్తి బాపు యాదవ్ ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇదిలా ఉండగా అంబర్ పేట మండల రెవెన్యూ కార్యాలయంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తిష్ట వేసి పెత్తనం చలాయిస్తున్నట్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాల్సి ఉంది. కానీ ఈ కార్యాలయంలో పనిచేసే రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ప్రైవేటు వ్యక్తులను తమ అసిస్టెంట్లుగా నియమించుకుని వారితో పని కానిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తమ వద్దకు వస్తున్న కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను విచారించాల్సిన ఆర్ఐలు, దానికి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులను దరఖాస్తుదారుల ఇండ్లకు పంపించి విచారణ జరిపిస్తున్నట్లు తెలిసింది. ఇదే అదనుగా ప్రైవేటు వ్యక్తులు దరఖాస్తు దారుల వద్ద పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసి పనులు చేసి పెడుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా సదరు ప్రైవేట్ వ్యక్తులు మండల రెవెన్యూ కార్యాలయం పరిసరాల్లో ఉన్న మీసేవ కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై దరఖాస్తుదారులను దోచుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

## వృద్ధాశ్రమ నిర్మాణానికి భూమి పూజ





**తిరుపతి, అగస్ట్ 25 (నిఘా న్యూస్):** గ్రామాలలోని యువత వారి భవిష్యత్తు కోసం పట్టణానికి వలస వెళ్లడంతో గ్రామాలలోని వృద్ధులు నిరాశ్రయులుగా మిగిలిపోతున్నారు. వారికోసం అదే గ్రామానికి చెందిన సిద్దరామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు వెంకటరెడ్డి వృద్ధుల కోసం ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమ నిర్మాణానికి భూమిపూజ ఏర్పాటు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథులుగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు పుంగనూరు ఇంచార్జ్ చల్లా బాబు రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, తిరుపతి ఇస్కాన్ టెంపుల్ ప్రెసిడెంట్ రేవతి రమణ దాస్, వృద్ధాశ్రమ ధాత సిద్ద రామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఇదేవిధంగా విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు గ్రామాల అభివృద్ధి కోసం సహకరించాలని ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే నాని విజ్ఞప్తి చేశారు.

## గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా రామరాజు



**చిలుకానగర్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి చిలుకా నగర్ శాఖ డివిజన్ కన్వీనర్ గా రామరాజు యాదవ్ నియమితులయ్యారు. కో కన్వీనర్లు గా రాచకొండ శివ, పేరుమాల శివకుమార్, కృష్ణారెడ్డి, మనోజ్ లను చిలుకా నగర్ డివిజన్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సీనియర్ సభ్యుల సమక్షంలో నియమించడం జరిగిందని భాగ్యనగర్ గణేశ సమితి ఉప్పల్ సమితి కన్వీనర్ రేవెల్లి రాజు తెలిపారు.

## పేదలకు సుప్ర ఫౌండేషన్ సాయం




**ఉప్పల్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** ఉప్పల్ చిల్కానగర్‌లో సుప్రా ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సుప్రా ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ రంజిత్ సింగ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ సింగ్ మాట్లాడుతూ సుప్రా ఫౌండేషన్ చైర్మన్ ఫౌండర్ గడ్డం సాయి కిరణ్ అడుగుజాడలో నడుస్తూ పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో మరికొన్ని కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహదేవ్, మనోహర్, గొల్ల సాయి, కార్తీక్, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ పురంలో.. విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గ



**హబ్సిగూడ, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** విశ్వ బ్రాహ్మణులకు అన్ని వేళల్లో అండగా ఉంటానని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నుంచి కావాల్సిన సహాయ సహకారాలను అందించే విధంగా కృషి చేస్తామన్నారు. హబ్సిగూడ డివిజన్ శ్రీనివాస్ పురం లో విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం రామంతాపూర్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ నాగారం శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి కొడపర్తి రామచందర్ చారి, తౌఫిక్ కంది శ్రవణ్ రెడ్డి, ఆకారపు అరుణ్, కోశాధికారి గోవిందారం కోటేశ్వర్ చారి, పెద్దలు కుందారం గణేశారి, మదన్మోహన్ చారి, శిల్పి శశిధర్ నాగారం భాస్కరాచారి, బైరోజు రామస్వామి, వేల్పు కొండ వెంకటేశం చారి, తదితరులు పాల్గొన్నారు.

## పేరాడకు త్రుటిలో తప్పిన ప్రమాదం

### టెక్కలి వైసిపి ఇంచార్జ్ పేరాడ సురక్షితం



**శ్రీకాకుళం, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** టెక్కలి నియోజక వర్గం వై ఎస్ ఆర్సీపీ ఇంచార్జ్ పేరాడ తిలక్ పెను ప్రమాదం నుండి సురక్షితంగా బయట పడ్డారు. నందిగాం సమీపంలో తిలక్ ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ఆటోను డీకొన్నది.ఆ వెంటనే జాతీయ రహదారి బ్రిడ్జి గోడను ఢీకొట్టి,మరలా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు అయినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలానికి జాతీయ రహదారి పెట్రోలింగ్ సిబ్బంది,నందిగాం పోలీసులు హుటాహుటిన చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి,నందిగాం పోలీసులు కేసు నమోదు చేశారు.

# తిరుపతి బస్ స్టాండ్ ను పరిశీలించిన కేంద్ర బృందం

## త్వరలో మల్టీ మోడల్ బస్ స్టాండ్ నిర్మాణం: ఎంపీ గురుమూర్తి




**తిరుపతి, అగస్ట్ 25 (నిఘా న్యూస్):** తిరుపతిలో ఇంటర్ మోడల్ బస్టాండ్ నిర్మించేందుకు కార్యాచరణ వేగవంతం అయ్యింది. నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి వేగవంతం చేయాలని కోరుతూ గత వారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని తిరుపతి ఎంపీ డా. గురుమూర్తి కలిసి చర్చించిన తరువాత త్వరిత గతిన పనులు మొదలయ్యేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ నేపథ్యంలో నేడు నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సీఈఓ ప్రకాష్ గౌర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ పూజా మిశ్రా తిరుపతి విచ్చేశారు. తిరుపతి బస్టాండులో సమీక్షా సమావేశం నిర్వహించిన పిదప బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకొన్నారు. అనంతరం తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ మల్టి మోడల్ బస్టాండ్ నిర్మాణ పనులు వైఎస్. జగన్మోహన్ రెడ్డి నేతృత్వం లోని గత ప్రభుత్వ హయాంలోనే అన్ని అనుమతులు వచ్చాయని కానీ బస్టాండ్ డిజైన్ లలో కొన్ని మార్పులు కోరడంతో అవి సిద్ధం అయ్యేలోగా ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ ప్రక్రియ ఆగిందని అన్నారు.ఇంటర్ మోడల్ బస్టాండ్ నిర్మాణం భవిష్యత్ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధునాతనంగా నిర్మిస్తున్నారని అన్నారు. ఈ నిర్మాణాలు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండనున్నాయని ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా బస్ టెర్మినల్, వాణిజ్య సముదాయాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, బస్టాండ్, రైల్వే స్టేషన్ ని అనుసంధానం చేస్తూ స్కై వాక్, డార్మెటరీలు, ఎలక్ట్రిక్ బస్సులు ఛార్జింగ్ చేసేందుకు అనుకూలంగా ఛార్జింగ్ స్టేషన్ మొదలగు సౌకర్యాలతో రూపుదిద్దుకోనుందని ఆయన తెలియజేసారు. ఈ నిర్మాణానికి సంబంధించి ఏవైనా పరిపాలన అనుమతులు అవసరమైన పక్షంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన స్పందించినట్లయితే టెండర్లు పూర్తయి త్వరలో పనులు మొదలవుతాయని ఎంపీ డా. గురుమూర్తి తెలియజేసారు.

# చిలుకా నగర్ లో కార్పొరేటర్ పర్యటన



**చిలుకానగర్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ గీత, జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పలు కాలనీలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. చిల్కానగర్ డివిజన్లోని శ్రీనగర్ కాలనీ ,మల్లికార్జున్ నగర్, ధర్మపురి కాలనీలో జిహెచ్ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, హెచ్ఎండబ్ల్యూఎస్ జిఎం సంతోష్ కుమార్ తో పర్యటించి సీవరేజ్ పైప్ లైన్ పూర్తిగా పాడైపోయిన విషయాలను వారికి వివరిస్తూ జిహెచ్ఎంసి, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ కలిసి కొన్ని పైప్ లైన్ల పనులు చేయాల్సిన అవసరం ఉందని, కొన్నిచోట్ల స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ లను సీవరేజ్ లో సీవరేజ్ పైప్ లైన్లను స్టమ్ వాటర్ పైప్ లైన్ లో కలపడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుందని వివరించారు. రెండు శాఖల సమన్వయంతో ఈ పైప్ లైన్ల పనులు పూర్తి చేయాల్సిందిగా కోరడం జరిగింది. కొత్త సీవరేజ్, సిసి రోడ్డు ప్రతిపాదనలు పెట్టాల్సిందిగా ఇరు డిపార్ట్మెంట్ల అధికారులను కార్పొరేటర్ గీత కోరారు. వర్షాకాలం దృష్ట్యా మల్లికార్జున్ నగర్, శ్రీనగర్ కాలనీలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరడం జరిగింది. కార్పొరేటర్ గీతా ప్రవీణ్ జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులు ఈ ఈ నాగేందర్, జిఎం సంతోష్ ఆదివారం సెలవు దినం రోజు కూడా ప్రజల ఇబ్బందులు గ్రహించి వచ్చినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎమ్డబ్ల్యూఎస్ ఏజీఎం రవీందర్ రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్లు కేదార్, శేఖర్, బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల్ల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, మహమూద్, ముద్దం శ్రీనివాస్ శ్యామ్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా బీపీ మండల్ జయంతి



**రామంతాపూర్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** బిందేశ్వరి ప్రసాద్ మండల్(బిపి.మండల్) 106 వ జయంతిని రామంతపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే సేవా సంఘం అధ్యక్షులు బి. మహేందర్ ఆధ్వర్యంలో బిసి సంఘాల కుల పెద్దలు పాల్గొని ఘనంగా జయంతి నిర్వహించి బిపి మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే సేవా సంఘం అధ్యక్షులు బి.మహేందర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రిజర్వేషన్ ఫలాలు బీసీ లకు అందుతున్నాయి, అంటే దానికి ప్రధాన కారకుడుగా బీపీ మండలేనని, బీసీ రిజర్వేషన్ 42 శాతాన్ని అమలు చేసి, కులగణన చేసినప్పుడే బీసీలకు సరైన ప్రాతినిధ్యం, అధికారం దక్కుతుందని అప్పుడే బిపి మండల్ కి మనం ఇచ్చే నిజమైన నివాళి అని మహేందర్ అన్నారు. జయంతి లో పాల్గొన్న రాష్ట్ర మత్స్యశాఖ మాజీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య మాట్లాడుతూ 1978లో రెండవ జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ గా బీపీ మండల్ కొనసాగి రెండు సంవత్సరాల దేశమంతా పర్యటించి బీసీ సమగ్ర ఆర్థిక రాజకీయ స్థితిగతులపై అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఆయన కృషివల్లే నేడు బీసీలకు రిజర్వేషన్ అమలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.నరసింహ, కే.లక్ష్మణ్, డి రాజు, డి.రాజ్ పాల్, ఎస్.మల్లేష్ యాదవ్, కే.చందు, జి.గురేష్ జట్టప్ప సురేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐఐటికి ఎంపికైన డిజీ పురం విద్యార్థిని



**శ్రీకాకుళం, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కకుష్ట.సృజన ఐఐఐటీ ఒంగోలు జనరల్ కేటగిరిలో ప్రవేశము పొందినట్లు ఆర్.జి.కే.యు.టి. నూజివీడు ప్రకటించారు. ఆగస్టు 25న విడుదల చేసిన 3వవిడత జాబితాలో ఆ వివరాలు ప్రకటించారు.ఈమె10వ తరగతిలో 566 మార్కులు సాధించారు.ఈమె తండ్రి నరసింహ మూర్తి ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్ గా పనిచేస్తున్నారు.దీనితో ఈ విద్యా సంవత్సరంలో ఐఐఐటీ లో సీట్లు పొందినవారి సంఖ్య 5కి చేరిందని ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య తెలిపారు. ఈ విద్యార్థినిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఐఐఐటీ విద్యా సంస్థ మంచి ప్రఖ్యాత సంస్థ అని,అందులో సీట్లు పొందటం గొప్ప విషయమని,అక్కడ కూడా మరింత బాగా చదివి పాఠశాలకు, తల్లితండ్రులకు పేరు తేవాలని మంచి స్థాయిలో స్థిరపడాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, కృష్ణవేణి, మార్కండేయులు, సి.ఆర్.పి.గిరి, రోజా, కమిటీ సభ్యులు విద్యార్థినిలను, తల్లదండ్రులను అభినందించారు.



ఇల్లందులో కోర్లపాటి కిరణ్ కుమార్తె అభినందన కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ తో పాటు ఏక్తా హౌస్ టీం సభ్యులు.

*-ఇల్లందు, ఆగస్టు 25 (నిఘా న్యూస్):*

## మృతుని కుటుంబానికి యువజన సంఘం సాయం



**శ్రీకాకుళం, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం సంతబొమ్మాళి గ్రామానికి చెందిన అల్లు యోగేశ్వరరావు ఇటీవల అనారోగ్యం కారణంగా ఆసుపత్రి పాలవడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకుని వారి వైద్య ఖర్చులుకోసం కొంత సహాయం అందించాలని స్నేహితులు ద్వారా సహాయ సేకరణ చేశారు.అతను అనారోగ్యంతో మరణించడంతో బాధిత కుటుంబానికి సేకరించిన మొత్తం రూ.21,350 లను అందజేసి కుటుంబానికి మనో ధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో యువజన సంఘ ప్రతినిధులు కూచెట్టి భానుప్రకాష్,అట్టాడ సాయికుమార్, భాస్కర రావు, సంతు శివ, సూర్య, బీమారావు, శేఖర్ తదితరులు సేకరించిన మొత్తాన్ని వారి కుటుంబానికి అందించారు.

## చదువులమ్మ చెట్టు నీడలో ఒక్కటైన ఆనాటి విద్యార్థులు

### ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు




**తిరుపతి, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** నవాబుపేటలోని మున్సిపల్ కార్పొరేషన్, అపరి ప్రైమరీ స్కూల్ 1992 సంవత్సరంలో ఏడవ తరగతి పూర్తిచేసిన ఆనాటి పూర్వ విద్యార్థులు ఆదివారం ఈ విద్యాలయం నందు ఒక్కటయ్యారు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువుకున్న చెట్టు నీడలో మూడు దశాబ్దాల తరువాత ఒకటయ్యారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేవు.వయసు మరచి అప్పటి వారి బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయత పలకరింపుల మధ్య పాఠశాల పులకరించి పోయింది. స్నేహితులకు సంబంధించిన పాటలను వింటూ ఆనంద డోలికలలో ఊగితేలారు. ఈ గురుశిష్యుల ఆనందోత్సవాలలో ఉపాధ్యాయులు గంగయ్య, బాలమ్మ,శ్రీదేవి,ద్రాక్షాయని,లక్ష్మీ తోపాటు స్కూల్ ఇంచార్జ్ అనిల్ కుమార్,పూర్వ విద్యార్థులు దేవి ప్రసాద్, సంతోష్,రాంబాబు,మునికృష్ణ, నగ్రా హరి ప్రసాద్, కామరూన్ బేఘం,భారతి,కృష్ణవేణి,ధరణి తదితర విద్యార్థులు పాల్గొని చిందేస్తూ చిన్నారులుగా మారారు.

## శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు



**ఉప్పల్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి నాట్య గురువులు లక్ష్మి శ్రీ నాయుడు శిష్య బృందం మహాగణపతిమ్, శ్రీ హరి స్తోత్రం, శివ తాండవ స్తోత్రం, భో శంభో, జయ జయ భారతి, అన్నమాచార్య కీర్తన, గరుడగమనా, అయిగిరినందిని, మీనాక్షి పంచరత్న, నమో నమో భారతే మొదలైన అంశాలను యోగ్య, ఇషిక, రియా అధ్య, తనూజ, సిరి సమన్విత చార్వి శ్రీ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా క్యారమ్ సింగిల్ పోటీలలో కే. శ్రీనివాస్(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్)విజేతగా నిలిచారు. కే. శ్రీనివాస్, ఎస్.ఆదిత్య పై 25-0,6-25,23-17 స్కోర్ తో విజయం సాధించాడు.సాగర్ తో కలిసి శ్రీనివాస్ డబుల్స్ లో జయప్రసాద్,పాండ్యన్ ను 17-14,25-0 స్కోర్ తో ఓడించారు. మహిళల సింగిల్స్ లో కే.నందిని జమిన్ జన్నత్ ను 9-25,25-1,25-7 స్కోర్ తో ఓడించారు.

-హైదరాబాద్, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):

# ఆర్ సి పురంలో వైభవంగా దుర్యోధన వధ

- భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే
- పుష్పయాగంతో ముగియనున్న మహాభారత ఉత్సవాలు





**రామచంద్రాపురం, అగస్ట్ 25 (నిఘా న్యూస్):** మండలంలోని సి రామాపురం, ఎన్ ఆర్ కమ్మపల్లి గ్రామాలలో పంచమ వేద మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ సాంస్కృతిక ఘట్టం వైభవంగా జరిగింది. ఆదివారం ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణంలో మట్టితో దుర్యోధనుని ప్రతిమను ఏర్పాటు చేసి వివిధ రంగులు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. దుర్యోధని పాత్రలు యుగంధర్,కిరణ్. భీముని పాత్రలు కొట్టే వేణునాధరెడ్డి, అశోక్ లు పోషించారు. గంగ మడుగులో దాక్కుని ఉన్న దుర్యోధనుని భీముడు లాక్కుని వచ్చి యుద్ధం చేసిన పౌరాణిక ఘటం లో కళాకారులు పాడిన మహాభారత పద్యాలు, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంది. దుర్యోధన వద సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు భారీగా హాజరయ్యారు. ఆలయ నిర్వహకులు భక్తులకు, ప్రేక్షకులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం మహాభారత ఘట్టంలో దుర్యోధన వద అనంతరం శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం అమ్మవారి భక్తులు అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. అగ్నిగుండం ప్రవేశంలో పాల్గొనే భక్తులు ఉదయం నుంచి ఉపవాసాలతో కంకణాలు కట్టుకుని శ్రీ ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చన్నీటి స్నానాలు చేసి తడి బట్టలతో వేప ప్రతిమ చేతబట్టి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నెత్తిన పెట్టుకొని ఓం శక్తి నామస్మరణల నడుమ నిప్పులపై నడిచి అమ్మవారిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. ఈ అగ్నిగుండ ప్రవేశం లో మొక్కుబడి ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నేడు పుష్పయాగం మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజున నిర్వహించే పుష్ప యాగం కార్యక్రమాన్ని సోమవారం శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవ విగ్రహాలకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. పుష్పయాగంతో మహాభారత ఉత్సవాలు ముగియనున్నాయి. పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని.. మండలంలోని సి.రామాపురం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ నాని, మబ్బు దేవనారాయణరెడ్డిలు శ్రీ ద్రౌపది అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి దృశ్యాలువతో సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె రామిరెడ్డి, ఎం తిరుమలరెడ్డి, సి.జనార్దన్ చౌదరి,టి కేశవ నాయుడు. ముదిపల్లి సురేష్ రెడ్డి, కె.ముద్దు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, కే.ధనంజయ రెడ్డి, కె.గిరిధర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ ఆర్నాల్డ్ జన్మదిన వేడుకలు



**జడ్చర్ల, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** మెన్నోనైట్ బ్రదరన్ చర్చేస్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ కౌన్సిల్ జి సి ప్రెసిడెంట్ రెవ. డాక్టర్. పి బి ఆర్నాల్డ్ 86వ జన్మదిన వేడుకలు జడ్చర్ల పట్టణంలో ఎం బి మెడికల్ సెంటర్ సమీపాన ఉన్న ఆయన స్వ గృహము నందు ఘనంగా జరిగాయి. రాజోలి ఎం బి పొలసమాజం ఛైర్మెన్ రెవ. ఆర్ పి జయప్రకాష్ ఆర్నాల్డ్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా పూల బొకే ఇచ్చి శాలువా కప్పి పూల మాలల తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగష్టు 22,1938లో డాక్టర్ ఆర్నాల్డ్ జన్మించారని ఆయన అన్నారు. జడ్చర్ల ఎం బి మెడికల్ సెంటర్ లో అనేకమందికి ఆపరేషన్లు చేసి ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. ఎం బి సంఘములను స్థాపించడంలో విశేష కృషి చేశారని ఆయన అన్నారు. ఆర్నాల్డ్ జన్మదిన వేడుకలకు వేలాది మంది తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల టెర్రి టోరియల్ డైరెక్టర్ జాన్ మక్బూల్, అసిస్టెంట్ డైరెక్టర్ రెవ. ఇజ్రాయేల్, పలువురు పాస్టర్లు, నాయకులు, సంఘ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాల అవగాహన సదస్సు



**బోడుప్పల్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** జనాభా పెరుగుదల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో ట్రాఫిక్ సమస్య ఒకటి. ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే ప్రమాదం వచ్చే అవకాశం చాలా ఎక్కువ. ఈ విషయాన్ని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల స్కూల్ డ్రైవర్లకు, ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో పల్లవి మోడల్ స్కూల్ బోడుప్పల్ లో ట్రాఫిక్ నియమాల అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్ గిరి ట్రాఫిక్ ఏసిపి ఎం.వి.శ్రీనివాసరావు, ఘట్కేసర్ ట్రాఫిక్ సిఐ పి.పరశురాం, ఉప్పల్ ట్రాఫిక్ సిఐ ఏ.సూర్య నాయక్, పాఠశాల ప్రిన్సిపల్ తనూజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలను నడపరాదని తెలియజేశారు. దీనివల్ల నడిపిన వారే కాకుండా తల్లిదండ్రులు కూడా శిక్షార్హులవుతారని తెలియచేశారు. వాహనాలలో కూడా పరిమితికి మించకుండా ప్రయాణికులు ప్రయాణించకూడదని తెలియజేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి శిక్షలు అమలు అవుతాయని తెలియజేశారు. మత్తు పదార్థాలను సేవించి, సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని తెలియజేశారు. విద్యార్థిని, విద్యార్థులు ఆత్మస్థైర్యంతో జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించుకుంటూ బంగారు భవిష్యత్తులోకి అడుగు పెట్టాలని తెలియచేశారు. బాలికలు కూడా ఆత్మరక్షణ గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలియజేశారు. తదనంతరం పాఠశాల ప్రిన్సిపల్ తనూజ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఎవరు కూడా వాహనాలు నడపరాదని తెలియజేశారు. ప్రైవేట్ వాహనాలలో పాఠశాలకు వచ్చే విద్యార్థులందరూ పరిమితికి మించకుండా ఉండాలని తెలియజేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన ఎడల పాఠశాల యాజమాన్యం వారు చర్యలు తీసుకుంటారని తెలియజేశారు.

## నేడు మొహర్రం సంతాపం దినాల ముగింపు కార్యక్రమం



**అంబర్ పేట, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):** అంబర్ పేట్ అలీ కేఫ్ దుర్గా నగర్ పంజా అషీర్ ఖానా లో మొహర్రం 41 వ రోజు సంతాపదినాల(చెహలూమ్) ముగింపు కార్యక్రమం ఈనెల 26వ ఇది సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అషీర్ ఖానా ముతావలి షేక్ యూసుఫ్ బాబా మహమ్మద్ ఇస్మాయిల్ మొహమ్మద్ ఖదీర్ లు మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. సంతాప దినాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని సాయంత్రం 7 గంటలకు పీర్లకు దట్టీల సమర్పణ,ప్రత్యేక పూజలు జరుగుతాయి అన్నారు. అనంతరం అషీర్ ఖానా వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాత్రి 12 గంటలకు పీర్లను ఊరేగించి నిమజ్జనం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట శాసనసభ్యుడు కాలేరు వెంకటేష్, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్, మాజీ కార్పొరేటర్ పద్మావతి రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్ రెడ్డి, దూసరి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## బీరప్పకు బోనమెత్తిన ముత్తిరెడ్డి గూడెం కురుమలు





**మూట కొండూరు, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలం, ముత్తిరెడ్డి గూడెంలో శ్రీ శ్రీ శ్రీ బీరప్ప స్వామికి బోనాలు కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు బోనమెత్తి ఊరేగింపు నిర్వహిస్తారు. బోనాల ఊరేగింపులో డప్పు చప్పుళ్లు,డోలు వాయిద్యాల నడుమ శివసత్తుల పూనకాలు,పోతురాజుల విన్యాసాలు,యువకుల కేరింతలు చూపరులను ఆకట్టుకున్నాయి. కురమల ఆరాధ్య దైవమెన బీరప్ప కామరాతి, అక్క మహంకాళి దేవులకు స్వామికి భక్తి శ్రద్ధలతో నైవేద్యాన్ని సమర్పిస్తారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీరప్ప స్వామి అందరినీ చల్లగా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద కురుమ బచ్చ విఠల్ కురుమ,బచ్చ బిక్షపతి కురుమ,కురుమ సంఘం అధ్యక్షుడు కాటిక స్వామి, ప్రధాన కార్యదర్శి కాటిక రవి, ఉపాధ్యక్షుడు బచ్చ రాములు కురుమ,కురుమ సంఘం నాయకులు కంచర్ల రాములు కురుమ,కంచర్ల బిరప్ప కురుమ,కురుమ సంఘం యువత కంచర్ల ప్రశాంత్ కురుమ, కాటిక రవి, కాటిక క్రాంతి యాదవ్,బచ్చ లింగుస్వామి కురుమ, బచ్చ శ్రీశైలం కురుమ,బచ్చ క్రిష్ణ కురుమ, కంచర్ల మదు కురుమ, బచ్చ ఉపేందర్ కురుమ,బచ్చ శ్రీశైలం కురుమ,కాటిక అరవింద్ కురుమ, కంచర్ల భాను,కంచర్ల భరత్ కురుమ, కంచర్ల తరుణ్ కురుమ, కాటిక శివ యాదవ్,కాటిక అనిల్, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అన్నా భావు సాటే సేవలు మరువ లేనివి



- జయంతి వేడుకల సందర్భంగా పలువురు నివాళులు
- ధర్మోరలో మంద కృష్ణ చిత్రపటానికి - పాలాభిషేకం

**లోకేశ్వరం, ఆగష్టు 25 (నిఘా న్యూస్):** మండలంలోని ధర్మోర గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్నా భావు సాటే సేవలు చిరస్మరణీయమని,అన్నారు. అన్న భావు సాటే 104వ జయంతి సందర్భంగా భావు సాటే విగ్రహా చిత్రపటానికి నికి పూలమాలలు నివాళులు అర్పించారు.అనంతరం. ఎస్సీ రిజర్వేషన్ అయిన సందర్భంగా మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధర్మోరా మాదిగ సంఘ అధ్యక్షులు సతీష్,గ్రామ మాజీ సర్పంచ్ మంద శారద భాస్కర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకోసం పోరాడిన గొప్ప భావు సాటే అన్నారు. సమాజం కోసం ఆయన చేసిన మంచి పనులను గుర్తు చేశారు. దేశ ప్రజల కోసం తన సాహిత్యంతో ప్రజలను జాగృతం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.కార్యక్రమంలో మాదిగ సంఘ ఉపాధ్యక్షులు వంశీ,బొగ్గుట నరసయ్య, శ్రీనివాసరావు,విద్య కమిటీ చైర్మన్ మాజీ అనిల్ కుమార్, సాయందర్,ఎస్ పోశెట్టి, బాతూరి భూమన్న,బాలి సాయన్న,బాతూరి చిన్న భూమన్న ,బాలి సురేష్, శ్రీకాంత్, సురేష్ రాకేష్, నరేష్, మాదిగ సంఘ నాయకులు మహిళలు తదితరులు ఉన్నారు.

## హామీలు నెరవేర్చడంలో జనసేనాని సక్సెస్

### కొనియాడిన చంద్రగిరి జన సైనికులు



**తిరుపతి, అగస్ట్ 25 (నిఘా న్యూస్):** డిప్యూటీ సీఎం, పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు మాసాలలోనే హామీలను నెరవేర్చడంలో ముందున్నారని చంద్రగిరి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ దేవర మనోహర్ కొనియాడారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆదివారం మీడియా ముందు జనసేన పార్టీ నాయకులు హరికృష్ణ, మురళి రెడ్డి, సాయి,హరి, వీరమహిళ విజయనిర్మల తదితరులతో కలిసి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సభలను తమ జనసేనాని పిలుపు మేరకు జరపడంతో ఈ సభలకు ప్రశంసల వర్షం కురిసిందన్నారు. గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం పవన్ తో సాధ్యమైందన్నారు. వైసీపీ పాలనలో పంచాయతీరాజ్, సర్పంచుల తదితర సంఘాలు సర్వనాశనం అయ్యాయన్నారు. రూరల్ ప్రాంతం నుంచి 20 మంది ఎంపీటీసీలు, 20 మంది సర్పంచులు తమ జనసేనలోకి రానున్నారని తెలిపారు. రానున్న సెప్టెంబర్ 2వ తేదీ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే క్లీన్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపడతామన్నారుగ్రామ సభలలో పాల్గొని కార్యక్రమాలను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## రంగసాయిపేటలో పోచమ్మ బోనాలు

### పోచమ్మ బోనం నెత్తిపై ధరించిన కార్పొరేటర్ చందన పూర్ణచందర్



**వరంగల్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని రంగసాయిపేట 42వ డివిజన్ లో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లి దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ గుండు చందన కుటుంబ సభ్యులతో పోచమ్మ తల్లి ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం చెల్లించి, నైవేద్యాలు బెల్లం శాఖ వస్త్రాలు కానుకలు కోళ్లు మేకపోతులను సమర్పించారు.


## దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

### దంత వైద్య నిపుణులు డాక్టర్.స్రవంతి



**తాండూరు, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** దంత సంరక్షణలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని దంత వైద్య నిపుణులు డాక్టర్ స్రవంతి వెల్లడించారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. దంతాలకు ఏ చిన్న అనారోగ్య సమస్య ఏర్పడిన వెంటనే దంత వైద్య నిపుణులను సంప్రదించడం ఉత్తమమైన మార్గమని హితవు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూరు పట్టణ కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దరిమీది రవి శంకర్ ఆధ్వర్యంలో తనతో పాటు దంత వైద్య నిపుణులు దంత సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. తాండూరు పట్టణ కేంద్రంలోని మాణిక్ నగర్ కాలనీకి చెందిన రామచంద్రప్ప వయసు (60) సంవత్సరాలు రోడ్డు ప్రమాదంలో దవడ దంతాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రికి రావడం జరిగింది. మెరుగైన వైద్య చికిత్సలో భాగంగా వారికి నగర ఆసుపత్రులకు పంపకుండా ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా శస్త్ర చికిత్సతో తీవ్ర గాయాలైన కొన్ని దంతాలను తొలగించడం జరిగిందని తెలిపారు. ఒకే రోజులో నాణ్యమైన వైద్య సేవలు అందించి, రామ చంద్రప్పను ఆరోగ్యంగా ఇంటికి పంపడం జరిగిందని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా చిన్న వయసు వారి నుండి, వయసు పైబడిన వారందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. రోజుకు 30 నుండి 35 మంది వరకు దంత సమస్యలతో ఆసుపత్రికి సందర్శించి వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. శరీరంలోని అన్ని అవయవాలతో పాటు దంత సంరక్షణ సైతం కీలకమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని గుర్తు చేశారు.

## మృతుని కుటుంబానికి సాయం



**లోకేశ్వరం, ఆగష్టు 25 (నిఘా న్యూస్):** మండలం దుర్గ నగర్ తండాకు చెందిన రాపని లక్ష్మి రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది.ఆమెకు ముగ్గురు సంతానం.లక్ష్మి చనిపోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న. మండలంలోని కిస్టాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దేవేందర్ రెడ్డి.మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు ద్వారా రూ.10వేలు అందజేశారు.

## త్వరలో మహేశ్వరం లో హైడ్రా కొరడా

**హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్**



**బాలాపూర్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలిగించి చెరువులను కాపాడి వరదలనుండి ప్రజలకు విముక్తి కలిగిస్తామని ఆరు నెలల క్రితమే మీర్పేట్ లోని చెరువులను సందర్శించిన సమయంలోనే చెప్పానని మాజీ ఎమ్మెల్య, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కిచ్చనగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఇటీవల నగరంలో హైడ్రా ఆధ్వర్యంలో చెరువులను ఆక్రమించి చేసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న నేపథ్యంలో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. మీర్పేట్ కార్పొరేషన్ లో చెరువుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టి కుంటలుగా మార్చారని అన్నారు. ఎన్ కన్వెన్షన్ తరహాలోనే ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ లలో ఎంత పెద్ద రాజకీయ నాయకుడు కానీ, ఏ సంస్థ అక్రమంగా కట్టినా తొలగించడం ఖాయమన్నారు. హైదారాబాద్ లో చెరువులు, పార్కులను కబ్జా చేసిన బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తు తున్నాయని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో హైడ్రా కమీషనర్ రంగనాథ్, రెవెన్యూ అధికారులు పర్యటించి కబ్జాలపై చర్యలు తీసుకుంటారని అన్నారు.

## విపత్తు నిర్వహణపై అవగాహన సదస్సు



**చోడవరం, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** ప్రేమ సమాజం ఆశ్రమంలో ఆదివారం విపత్తు నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సత్య సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజాస్టర్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ ప్రతి ఒక్కరు కూడా నేర్చుకోవాలని తెలియజేశారు. అలాగే డిజాస్టర్ మేనేజ్మెంట్ స్టేట్ ఇన్చార్జ్ బండి సురేష్ వాళ్లు పలు సూచనలు చేశారు.

## ప్రతిభావంతులకు అవార్డుల ప్రధానం



**చోడవరం, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):** పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి యాప్ ద్వారా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లిన పార్టీ నాయకులలో మాడుగుల నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురికి ప్రతిభా అవార్డులు అందించారు. కోన చంటి,కొల్లి దేవుడు చామంతుల బాలు,దాడి నాయుడు,కొండలరావు ఎడ్ల శ్రీను, పేలూరి రాములను నారా లోకేష్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సన్మానించారు.

## విశ్రాంత టీచర్లు ఆయాలకు సన్మానం



**అడ్డగూడూరు, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** అడ్డగూడూర్ మండల పరిధిలోని ఆరుగురు అంగన్వాడి టీచర్లు ఇద్దరు ఆయాలు పదవి విరమణ చేయడం జరిగింది. వారి సన్మాన కార్యక్రమం అడ్డగూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వారి బంధుమిత్రులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, కుటుంబ సభ్యులు పాల్గొని పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారు అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు మొదటి గురువుగా ఉంటూ ఎంతోమందిని తీర్చిదిద్దారని కొనియాడారు. సూపర్వైజర్ మధురమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం రిటైర్మెంట్ అయిన వారికి ఎలాంటి పెన్షన్ గాని, డబ్బులు గానీ ఇవ్వకపోవడం బాధాకరమని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రిటర్మెంట్ అయిన అందరికీ పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.అనేక సంవత్సరాల నుండి అంగన్వాడి టీచర్లుగా, వర్కర్లుగా సేవలు అందించి రిటర్మెంట్ అవుతున్న అంగన్వాడి టీచర్లు యం.ఉపేంద్రమ్మ, టి.పుష్పమ్మ,యం. మురళమ్మ, జె.లలిత, నిర్మల ప్రకాష్ కే.అంజమ్మ, అంగన్వాడి వర్కర్లు ఇ.అంజమ్మ, సిహెచ్.లింగమ్మ లు మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలుగా అందరితో కుటుంబ సభ్యులుగా ఉన్నామని భవిష్యత్తులో తమ సలహాలు సూచనలు అందిస్తామని తెలిపారు.

# వాజ్ పాయ్ విధానాలకు భిన్నంగా.. కేంద్రంలో బిజెపి పాలన

- **ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే వామపక్ష సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడాలి**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్**




**కడప, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం పొద్దుటూరు పట్టణ కమిటీ కార్యదర్శి కే.సత్యనారాయణ ఆధ్వర్యంలో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదంపై స్థిరత్వం లేని వాదన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తుందని, ఇది పూర్వపు బిజెపి ప్రధాని వాజ్ పాయ్ విధానానికి భిన్నమైనదిగా ఉందన్నారు. బిజెపి అనుకూల ఆదాని కార్పొరేట్ కంపెనీ ప్రపంచ టెర్రరిస్ట్ దేశంగా పిలవబడుతున్న ఇజ్రాయిల్ "స్పై వేర్", "పెగాసిస్", వివాదాస్పంద టెక్నాలజీ కొనుగోలు చేసి ప్రతిపక్షాల రాజకీయ వ్యూహాలు ముందస్తుగా తెలుసుకొని బీజేపీకి చేరవేస్తూ ఉన్నారన్నారు. ఐరోపా, ఆసియా, ప్రజలు రష్యా, ఉక్రేయిన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారనారు. ఈ యుద్ధం వల్ల ఐరోపా దేశాలలో ద్రవ్యోల్బణం , నిరుద్యోగం, ఇంధన కొరత, ప్రజల జీవన ప్రమాణాలు పడిపోవడం, జరుగుతున్నాయని, భారత్ ప్రధాని నరేంద్ర మోడీ రష్యా, ఉక్రెయిన్ పర్యటన శాంతి ఒప్పందానికి ఉపకరిస్తుందా! లేదా అనేది మనం వేచి చూడాలన్నారు. ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా 64 దేశాలలో అతి మితవాద, జాతి దురహంకార శక్తులు పెరుగుతూ ఉంటే, మరోవైపు ప్రపంచంలోని దక్షిణాఫ్రికా, అమెరికా, యూరప్ ఖండాల్లోని దేశాలైన వెనిజులా, బెల్జియం, గ్రీసు, ఫిన్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, డెన్మార్క్, చెక్ రిపబ్లిక్, మరికొన్ని చిన్న దేశాల్లో సోషలిస్టు ప్రజా సంక్షేమ భావాజాలంం కలిగిన పార్టీలు ఎన్నికల్లో గెలిచి సంకీర్ణ ప్రభుత్వాలుగా ఏర్పడుతున్నాయని గుర్తు చేశారు. రష్యా, చైనా, భారత్, మైత్రి అమెరికా ప్రపంచ ఆదేపత్యాన్ని తొలగిస్తుందన్నారు. భారతదేశంలో 2024 లో జరిగిన 18వ సార్వత్రిక ఎన్నికల్లో మితవాద పార్టీలైన బిజెపి మిత్రపక్షాలు, నయా లౌకికవాద కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలు, పరస్పరం అధికారం కోసం పోటీ పడ్డప్పటికీ, ఉమ్మడిగా వామపక్ష పార్టీలను పార్లమెంటు, శాసనసభ, చట్టసభల్లోకి ఎంట్రీ కాకుండా వారు కుట్ర చేశారన్నారు. కమ్యూనిస్టుల నమ్మకమైన రాజకీయ పోరాటాలు ప్రజల ఆకర్షిస్తున్నాయని విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. దేశంలోనే వామపక్ష ప్రగతిశీల శక్తులు ఐక్యంగా పురోగమించాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే వామపక్ష సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడాల్సిన అవసరం ముందుందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఘోర పరాజయానికి "ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్" తీసుకొని వచ్చి, ప్రజలపై బలవంతంగా రుద్దడమే ప్రధానమైన కారణమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాల్సిందేమిటంటే బిజెపి మిత్రపక్షాలను ఊతకర్రలా వినియోగించుకొని, వదిలి వేస్తున్న వైనాన్ని పురాలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, సిపిఎం పొద్దుటూరు పట్టణ కమిటీ సభ్యులు ముంతాజ్ బేగం, సర్వేశ్వరి, రాఘవ, విజయ్ కుమార్, బాలసుబ్బయ్య, రమేష్, డాక్టర్ సురేష్, డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. నమస్కారములతో, కే.సత్యనారాయణ, సిపిఎం పట్టణ కార్యదర్శి, పొద్దుటూరు.

# జిల్లా స్థాయి యోగా పోటీలు

**విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలి: కైలాస్ యాదవ్**






**వరంగల్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని రంగసాయిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం హనుమకొండ వరంగల్ జిల్లాల స్థాయిల యోగా పోటీల ఎంపిక ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కైలాష్ యాదవ్ విచ్చేసి యోగా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలి క్రీడాకారులకు సూచించారు. క్రీడా పోటీల్లో పాల్గొని ఉత్తమ క్రీడాకారులు ఎదగాలని అన్నారు. తెలంగాణ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ హనుమకొండ జిల్లాల యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనిమిదవ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే యోగ సాధన చేయడం వల్ల జ్ఞాపక శక్తితో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో యోగా పోటీల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. హనుమకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు యోగ సాధన చేయడం వల్ల ఎలాంటి అనారోగ్యం రాకుండా ఉంటారని అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి బొలిశెట్టి కమలాకర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యోగ పోటీలో పాల్గొన్న క్రీడాకారులను ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ యోగ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుండే కిరణ్. యోగ అసోసియేషన్ కమిటీ సభ్యులు వ్యాయామ ఉపాధ్యాయులు, యోగా అసోసియేషన్ జిల్లా కోశాధికారి పాకాల రవిందర్, పాషా నారాయణ, హన్మకొండ లయన్స్ క్లబ్ కోశాధికారి కిరణ్మయి రజిత, జ్యోతి ప్రేమలత యోగా క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా వినాయక ఉత్సవాలు

**ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి**




**అంబర్ పేట్, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):** రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి అన్నారు. అంబర్ పేట్ చే నంబర్ మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ లో ఈస్ట్ జోన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితిగా విచ్చేసిన డీసీపీ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, అనుమానితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మండపాల వద్ద నిర్వాహకులు రాత్రిపూట కచ్చితంగా పడుకోవాలని తెలిపారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ఎప్పటికప్పుడు పోలీసులతో సంప్రదిస్తు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, కాచిగూడ ఏసీపీ రఘు, అంబర్ పేట ఇన్స్పెక్టర్ డి.అశోక్, కాచిగూడ ఇన్స్పెక్టర్ చంద్రకుమార్, నల్లకుంట ఇన్స్పెక్టర్ జగదీశ్వర్ రావు, వినాయకమండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు ముగిసిన వైద్య పరీక్షలు

**రెండు రోజులపాటు కొనసాగిన పరీక్షలు**



**తిరుపతి, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** గత రెండు రోజులుగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకున్నారని టీటీడి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో టిటిడి రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 24వ తేది శనివారం, 25వ తేది ఆదివారం రెండు రోజులు పాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రెండు రోజులపాటు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు రెండు రోజుల పాటు చెన్నై గ్లోబల్ హాస్పిటల్ ఆధ్వర్యములో ఈ వైద్య సేవలు అందించినట్టు తెలిపారు. టీటీడీ పరిపాలన భవనంలోని టిటిడి సెంట్రల్ హాస్పిటల్ నందు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 400 మంది రిటైర్డు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించామన్నారు. అందులో ఎకో (2డి స్క్రీనింగ్),సిబిజీ(రాండం బ్లడ్ షుగర్), పిఎఫ్టి (పల్మనరీ ఫంక్షన్ టెస్టింగ్),ఈసీజీ (ఎలక్ట్రో కార్డియోగ్రామ్)వంటి వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. మా విజ్ఞప్తిని మన్నించి అన్ని విధాలా అనుమతులు ఇచ్చిన టీటీడి యాజమాన్యంకు, ప్రత్యక్షంగా,పరో క్షంగా సేవలు, సహయ సహకారాలు అందించిన కేంద్రీయ వైద్యశాల వైద్యులకు ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిటిడి రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి తాటిపర్తి దాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ కు త్వరలో శంఖుస్థాపన

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి, అగస్ట్ 25 (నిఘా న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ కు త్వరలో శంఖుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. చంద్రబాబు నాయుడు పాలనలో పురాతనమైన సెంట్రల్ బస్టాండ్ స్థానంలో ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నిర్మించాలని నిర్ణయించారని. ఆయన తెలపారు. కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్టాండ్ నిర్మాణాన్ని పట్టించుకోక పోవడంతో బస్టాండ్ నిర్మాణం జాప్యమైందని ఆయన చెప్పారు. ఎన్ హెచ్ ఎల్ ఎం ఎల్ సిఈఓ ప్రకాష్ గౌర్, ప్రాజెక్ట్ డైరక్టర్ పూజా మిశ్రాలను ఆదివారం ఆర్టీసి గెస్ట్ హౌస్ లో ఎమ్మెల్యే భేటి అయ్యారు. ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ డిజైన్ పై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సిఈఓ ప్రకాష్ గౌర్ ఎమ్మెల్యే కు వివరించారు. డిజైన్స్ ఆమోదించిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని సిఈఓ తెలిపారు. నవంబర్ లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి మార్చిలో నూతన బస్టాండ్ పనులకు శ్రీకారం చుట్టుతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా తిరిగి రావడంతో తిరుపతి వాసుల చిరకాల వాంఛ నెరవెరనుందని ఆయన చెప్పారు. ప్రయాణికులు, భక్తులకు ఆధునాతన సౌకర్యాలతో నూతన బస్టాండ్ రూపు దిద్దుకుంటుందని ఆయన తెలిపారు.ఈ భేటిలో జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి తదిరత అధికారులు పాల్గొన్నారు.



కేటీఆర్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ ను తమ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. కేటీఆర్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడంతో మనోహర్ ధన్యవాదాలు తెలిపారు.

*-ముస్తాబాద్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):*

## గ్రీన్ సైనిక్ పురి కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే



**కాప్రా, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** కాప్రా సర్కిల్ పరిధి సైనిక్ పురి హైదరాబాద్ నగరంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన ఏరియా, విశాలమైన ప్లాట్లు భవనాలు, రోడ్లు పచ్చటి చెట్లు ఖచ్చితమైన నియమ నిబంధలు పాటిస్తున్న సొసైటీ అనే పేరు ఉంది. ఆదివారం గ్రీన్ సైనిక్ పూరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం హెచ్ఎంటి బేరింగ్స్ కమ్యూనిటీ హల్ లో జరిగింది. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. గ్రీన్ సైనిక్ పురి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అన్ని కాలనీల నుండి ప్రతినిధులు రావడం సంతోషకరం అని ఆయన అన్నారు. కాలనీల సమస్యలు తన దృష్టికి తేవాలని వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మెట్రో లైన్ ఈసిఐఎల్ చౌరస్తా వరకు పొడిగించాలని అలాగే శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం అవసరం ఉందని కాలనీల ప్రతినిదులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, గ్రీన్ సైనిక్ పూరి నిర్వహకులు చంద్ర శేఖర్, బీజేపీ నాయకులు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



**నారాయపేట, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదు అని, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగా అవకాశం ఉంటుంది అని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుందని తెలిపారు.



పాలకుర్తి మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో కంట్ల మహేశ్వర గుడి ప్రాంగణంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద గౌడ్, సార కోల గౌడ్ లను కులస్తుల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది, పాలకుర్తి పెద్ద గౌడు గా కమ్మగాని. పర్శరాములు గౌడ్ సార కోల గౌడ్ గా బండి. కిరణ్ కుమార్ గౌడ్లను ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమంలో పాలకుర్తి గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

*-పాలకుర్తి, ఆగస్టు 25 (నిఘా న్యూస్):*

# నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న జనవిజ్ఞాన వేదిక

### అభినందనలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**కాప్రా, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** పేద ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించడం సంతోషకరమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక కాప్రా మండలం కమిటీ ఆధ్వర్యంలో చక్రిపురంలోని శ్రీ చక్రి విద్యా నికేతన్ స్కూల్ లో ప్రతినెల నిర్వహిస్తున్న బీపీ, షుగర్ మెడికల్ క్యాంపు 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జెవివి రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా నిరంతరం వైద్య సేవలు నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదికను అభినందించారు. ఇలాంటి వైద్య శిబిరాల నిర్వహణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గతంలో నేను ఎమ్మెల్యేగా లేకపోయినా, ప్రస్తుతం నేను ఎమ్మెల్యేగా ఉన్నా, నా వంతు సహకారం, ఎల్లప్పుడూ జన విజ్ఞాన వేదికకు ఉంటుందని అన్నారు. వైద్య శిబిరంలో నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లను, వాలంటీర్లను అభినందించి. అనంతరం వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి తన వంతు సహాయ సహకారం అందిస్తూ, ఎంతోమంది ఎంబిబిఎస్ విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నీట్ 2024 వైద్య విద్య ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 4924 ర్యాంక్ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 93వ ర్యాంక్ సాధించి, అత్యున్నత ప్రదర్శన కనబరిచిన నాగార్జున నగర్ కాలనీకి చెందిన పిట్టల నాగరాజు, శశికళ దంపతుల కుమార్తె అయిన పిట్టల సంజనని ఘనంగా సన్మానించి, తమ వంతుగా ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అంతకుముందు వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పిట్టల నాగరాజు, కోశాధికారి జెన్ని, మాజీ కార్పొరేటర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త రామారావు, మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివగౌడ్, వేమూరి మహేష్ గౌడ్, జన విజ్ఞాన వేదిక నాయకులు సోమయ్యచారి, అండాలి, దుర్గాచారి, వెంకయ్య, జి.కరుణాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, శివప్రసాద్, శివ శంకర్ రెడ్డి, శ్రవణ్, మధుసూదన్, ఎంఎల్ చౌదరి, వెంకటరమణ, శేషు, స్పందన, సంజన, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు సిహెచ్ వరప్రసాద్, చందన్ రాజు, ఉదయ భాస్కర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జంటను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాని



**చంద్రగిరి, అగస్ట్ 25 (నిఘా న్యూస్):** చంద్రగిరి మండలం, పుల్లయ్య గారి పల్లి గ్రామానికి చెందిన కనుమూరి సురేష్ నాయుడు కుమారుడు వరుణ్ చౌదరి వివాహ వేడుకలలో భాగంగా తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ హాలులో జరుగుతున్న వివాహ రిసెప్షన్ వేడుకలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకులతో కలిసి హాజరయ్యారు. దంపతులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడారు. వివాహానికి వచ్చిన అందరిని ఆప్యాయంగా పలకరించారు. ఈ రిసెప్షన్ వేడుకలకు మండల నాయకులు, కార్యకర్తలు, ఇతరులు పాల్గొన్నారు.

## సిపిఐలో భారీగా చేరికలు



**కొత్తగూడెం/చుంచుపల్లి, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** కార్మికులకు, కర్షకులకు, పేదవర్గాల ఎర్ర జెండానే భరోసాగా నిలుస్తోందని, వందేళ్లుగా ప్రజలపక్షం వహిస్తూ బలమైన రాజకీయ శక్తిగా సిపిఐ నిలబడిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పునరుద్ఘాటించారు. చుంచుపల్లి మండలం, ఉమ్మడి పెనగడప గ్రామపంచాయతి పరిధిలోని పెనగడప గ్రామంలో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశం సందర్భంగా మన్నెం వెంకన్నా, పఠాన్ ఖాసీం ఖాన్, అలీం, తాజుద్దీన్, రహీం జానీ, కుంచం శ్రీనివాస్, ఆదిమూలం శ్రీను, కుంచం మల్లయ్య, గోపాల్, బరగడి నాగరాజు, బరగడి సాగర్, ఓడపల్లి ధర్మయ్య, కృష్ణవేణి, గొగ్గెల వీరభద్రం, పూనెం నాగరాజు, తగరపు రవి, బి రవి, నవీన్, శ్రీనివాస్, మన్నెం భాస్కర్, రఘు తదితరుల నేతృత్వంలో వివిధ గ్రామాల నుంచి 120 కుటుంబాలు కూనంనేని, సాబీర్ పాషా సమక్షంలో సిపిఐలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ గడిచిన ఎనిమిది నెలల కాలంలో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంతో అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి శాశ్వత పరిస్కారంకోసం కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రజల మౌలిక అవసరాలైన త్రాగు నీరు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం, మెరుగైన ప్రభుత్వ వైద్యం కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే గెలుపుఫలాలు ప్రజల దరిచేర్చామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. నియోజకవర్గ రైతుల సాగునీటి సమస్యపై ప్రత్యేక ద్రుష్టి సారించానని, సీతారామ ప్రాజెక్టు నీటిని నియోజకవర్గానికి మళ్లించేందుకు ప్రతుత్వంపై వత్తిడి తెస్తున్నానని, త్వరలో నియోజకవర్గ రైతాంగానికి నీటి సమస్య తీరనుందన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ప్రజా సంఘాల్లో బాధ్యతలు చేపట్టి పార్టీ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, మండల కార్యదర్శి, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, జి వీరాస్వామి, బొర్ర కేశవరావు నాయకులు తోట రాజు, నీడాల సుధాకర్ మన్నే భద్దరరావు కట్టా పుల్లయ్య, కట్టా ఉదయ్, రామకృష్ణ, రాజు సాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెర వేరుస్తాం

### టియుడబ్ల్యూజే ఐజెయు జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్






**వేములవాడ, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):** తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళన సమావేశం జిల్లా అధ్యక్షుడు దండు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లా స్థాయి ప్రెస్ క్లబ్ కు ఎకరం భూమి అలాగే జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్ట్ ల సమస్యలను ప్రభుత్వ విప్ కు విన్నవించి వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ ప్రసంగించారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి, భద్రతకు ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం తదితర అంశాలు ప్రభుత్వం దృష్టిలో ఉందని వెల్లడించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు బాధ్యత గా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, జాతీయ కౌన్సిల్ మెంబర్ నగునూరి శేఖర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దాసరి దేవేందర్, జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను సన్మానించారు.

## స్వదేశ్-ఫాల్గుణి.. షేన్ పీకాక్ దుస్తుల ఆవిష్కరణ




**హైదరాబాద్, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):** భారతీయ కళానైపుణ్యాన్ని ప్రోత్సహించడంలో గర్వపడే స్వదేశ్ బ్రాండ్, అంతర్జాతీయ వస్త్ర తయారీదారులు ఫాల్గుణి షేన్ పీకాక్ తో కలిసి హైదరాబాద్ లోని స్వదేశ్ ఫ్లాగ్ షిప్ స్టోర్ లో ఇండియా కోచర్ వీక్ లో ప్రదర్శించినట్లు ఫాల్గుణి షేన్ పీకాక్ సహ వ్యవస్థాపకుడు షేన్ పీకాక్ ఆదివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫాల్గుణి షేన్ పీకాక్ 20 వ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నట్లు తెలిపారు. సంప్రదాయ పద్ధతులను అత్యాధునిక ఫ్యాషన్ డిజైన్ తో మేళవించేందుకు స్వదేశ్ ఫాల్గుణి షేన్ పీకాక్ తో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సేకరణలో కాంజీవరం సిల్క్స్, చికంకారీ ఎంబ్రాయిడరీ, బనారసి బ్రోకేడ్స్ వంటి ఐకానిక్ భారతీయ హస్తకళలు ఉన్నాయన్నారు.

## వణుకు పుట్టిస్తున్న 'హైడ్రా'.. అక్రమ నిర్మాణాలే టార్గెట్..!

### ఉప్పల్ నల్లచెరువు కబ్జాలపై పై ఫోకస్ పెట్టిన హైడ్రా






**ఉప్పల్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) చర్యలతో రాజధాని హైదరాబాద్, శివారు చెరువుల్లో ఆక్రమణలు చేసిన వారి వెన్నులో వణుకు పుడుతోంది. ఈ స్వయంప్రతిపత్తి సంస్థ కమిషనర్ ఏ. వి.రంగనాథ్ ఎఫ్ టి ఎల్ పరిధిలోని అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించడం, చెరువులను పరిరక్షించడమే తొలి ప్రాధాన్యతగా తీసుకున్న అధికారులు అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ఉప్పల్ నల్లచెరువు కబ్జాలకు గురైందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్పందించిన ఆయన ఆగస్టు 13వ తేదీ నల్లచెరువును స్వయంగా వచ్చి పరిశీలించారు. నల్ల చెరువు దాదాపు 90 శాతం కబ్జాలకు గురైన విషయం గుర్తించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సర్వే నంబర్ 150 లో సుమారు 120 ఎకరాలు విస్తీర్ణంలో నల్లచెరువు విస్తరించి ఉంది. రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల సమన్వయం లోపం వల్ల కబ్జాల బారిన పడింది. నల్లచెరువు ఒక వైపు వరంగల్ జాతీయ రహదారి ఉండగా మరో మూడువైపులా ఎఫ్.టి.ఎల్ బఫర్ జోన్లు ఉన్నాయి. రూ.11 కోట్ల వ్యయంతో చెరువు సుందరీకరణ పనులు చేపట్టినప్పుడు చెరువు మధ్యలో కట్ట వేయడం కబ్జాదారులకు వరంగా మారింది. దీంతో ఎఫ్.టి.ఎల్ బఫర్ జోన్లలో దర్జాగా కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టారు. చెరువులోకి వచ్చే నాళాలను సైతం మూసివేసిన వైనం హైడ్రా కమిషనర్ గుర్తించారు. అలాగే నల్లచెరువు నుండి ఫిర్యాదు కూడా వైపు వెళ్లే నాళాలను సైతం కబ్జాదారులు కబ్జాది కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. నల్ల చెరువుకు సంబంధించి శాటిలైట్ చిత్రాలను హైడ్రా సేకరించినట్లు తెలిసింది. ఏ సమయంలోనైనా నల్లచెరువు కబ్జాలను తొలగించేందుకు హైడ్రాధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కబ్జాదారుల గుండెలు గుబేలు మంటున్నాయి. నల్లచెరువును కబ్జాల బారి నుంచి రక్షించాలని ఉప్పల్ ప్రజలు హైడ్రాను కోరుకుంటున్నారు.

### వడమాలపేట..

## ఇంటి స్థలాలను సందర్శించిన కిరణ్ బృందం

### 430 ఎకరాలలో 5219 మంది టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాలు




**తిరుపతి, అగస్ట్ 25 (నిఘా న్యూస్):** టీటీడీ ఉద్యోగులకు వడమాలపేట, పాదిరేడు అరణ్యంలో కేటాయించిన ఇంటి స్థలాలను చీర్ల కిరణ్ బృందం ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ ఎంప్లాయిస్, బ్యాంకు ఉపాధ్యక్షులు టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు మొదట్టి విడత గా 3518 మందికి, రెండవ విడతగా 1701 మందికి మొత్తం దాదాపు 430 ఎకరాలలో 5219 మంది ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా దాదాపు పూర్తి చేయడం జరిగిందని, కాని ఇంటి స్థలాల వద్ద అభివృద్ధి పనులు చాలా నిదానంగా జరుగు తున్నాయన్ని ఇప్పటికే ఉద్యోగులందరు ఇంటి స్థలాలకు సంబంధించిన డబ్బులు చెల్లించడం జరిగిందని, కాని చాలా వరకు ఉద్యోగి స్థలంకు సంబంధించిన హద్దులు, ప్లాట్ నంబర్ లు చూపలేదని తెలిపారు. ఇప్పటికైనా టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన వడమాలపేట ఇంటి స్థలాల వద్ద అభివృద్ధి పనులు త్వరగా పూర్తి అయేలా చర్యలు తీసుకోవాలని, అలాగే టీటీడీ ఉద్యోగి నుండి అదనంగా ఎటువంటి డబ్బులు వసూలు చేయకుండా పూర్తిగా టీటీడీ నిధులతోనే రోడ్లు, డ్రైనేజీ లు, విద్యుత్, త్రాగునీరు, పార్క్ లు మొదలైన అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏర్పేడు వద్ద మూడోవ విడత లో ఇచ్చిన నాలుగు వేల మందికి త్వరగా ఇంటి స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సునిల్ కుమార్ యాదవ్, కోశాధికారి గుంటూరు రేఖ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంకీపురం పవన్, మణికంఠ, కార్యవర్గ సభ్యులు ధరణి కుమార్, తేజస్విని, ఈశ్వర్ నాయక్ పిఎం, మురుగన్,భాస్కర్, పి,భాస్కర్, ఉమా శంకర్, బాలకృష్ణ, గుణ, మస్తాన్ రావు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### అంతరిక్ష విశేషాల చిత్ర ప్రదర్శన..

## ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అంతరిక్షంలో మోదీతో సెల్ఫీ




**తిరుపతి, ఆగస్ట్ 25 (నిఘా న్యూస్):** జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గూడూరులో ఏర్పాటు చేసిన అంతరిక్ష విశేషాల చిత్ర ప్రదర్శన (ఫోటో ఎగ్జిబిషన్) మూడు రోజుల పాటు ఆసక్తికరంగా సాగింది. ఆగస్టు 23న గూడూరు శాసనసభ్యులు డా.పాశిం సునీల్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రదర్శనను గూడూరులోని 50కి పైగా పాఠశాలలు, కళాశాలలకు చెందిన 10వేల మందికి పైగా విద్యార్థులు తిలకించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా గూడూరులోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వించిన పోటీల్లో ప్రథమ, ద్వితియ, తృతియ స్థానాల్లో నిలచిన విద్యార్థులకు ప్రతిరోజు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అంతరిక్షంలో మోడీతో సెల్ఫీ కౌంటర్ విద్యార్థులను విశేషంగా ఆకర్షించింది. ప్రతి ఒక్కరూ సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. ప్రదర్శనలో భాగంగా ఐ.సి.డి.ఎస్, ఆరోగ్య, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, పోస్టల్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ భారత ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన విశేషాలను పిల్లలకు తెలియజేశాయి. రెండోరోజు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అంతరిక్ష వారోత్సవాల అవగాహన ర్యాలీ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. శాస్త్రవేత్తల ఛాయా చిత్రాలతో సాగిన ర్యాలీ భారతదేశ విజయాన్ని కళ్ళకు కట్టింది. గూడూరు శాసన సభ్యులు, మున్సిపల్ కమిషనర్ సహా కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు నిర్వాహకులను ప్రశంసించారు. విద్యార్థులకు శాస్త్రసాంకేతిక అంశాల పట్ల అవగాహన కల్పించే విధంగా ప్రదర్శనను ఏర్పాటు చేయటం పట్ల అభినందలు తెలియజేశారు. చంద్రయాన్-3 విజయం ప్రతి భారతీయుడు గర్వించవలసిన అంశమని,అదే సమయంలో భూమి మీద పర్యావరణాన్ని కూడా కాపాడుకోవలసిన అవసరం ఉందని కార్యక్రమానికి విచ్చేసిన వక్తలు అభిప్రాయపడ్డారుఅంతరిక్ష దినోత్సవ ప్రదర్శనలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మ పేరిట ఒక మొక్క,సెల్ఫీ బూత్ మరో ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం చివరి రోజున కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ దిశగా పిలుపునిచ్చారు. విద్యార్థులకు మరింత ప్రయోజనం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం, నెల్లూరు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేయటం జరిగింది. సైన్స్ అంటే విద్యార్థుల్లో ఉండే ఆసక్తి మరింత ప్రత్యేకమైనది. ఈ ప్రదర్శన వల్ల వారికి ఎన్నో సందేహాలు తీరాయి. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా వారిలో మరింత అవగాహన పెంచుతుంది. ఈ స్ఫూర్తి వారి భవిష్యత్తుకు చక్కని బాటలు వేస్తుంది. అంతరిక్ష విశేషాలు తెలుసుకున్నాం. కె.మౌనిక, విద్యార్థిని అంతరిక్ష విశేషాల చిత్ర ప్రదర్శన నన్నెంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా అంతరిక్షంలో మోదీతో సెల్ఫీ నాకెంతో నచ్చింది. అంతరిక్ష రంగంలో భారతదేశం సాధించిన విజయాలు, భవిష్యత్ ప్రణాళికలు, ఇలా అన్నింటి గురించి సమగ్రంగా తెలుసుకోగలిగాను. విద్యార్థులకు ఇదెంతో ప్రయోజనకరం. పర్యావరణ ప్రాధాన్యత తెలుసుకున్నాం. జి.చందన విద్యార్థిని చంద్రమండలం మీద సాధించిన విజయానికి గర్వపడటంతో పాటు, మన పర్యావరణాన్ని కాపాడుకోవాలన్న సందేశం నాకు ఎంతో నచ్చింది. ముఖ్యంగా అమ్మ పేరిట మొక్క కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ అవగాహన కల్పించటం ఆనందంగా ఉంది. నేను కూడా మొక్కలు నాటి సెల్ఫీని సామాజిక మాధ్యమాల్లో పంచుకుని మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాను.


## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** తన దృష్టికి వచ్చిన కాలనీల సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ లోని పరిమళ నగర్ లో పరిమళ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్, సీసీ కెమెరాల ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఎస్సై సుధాకర్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు గణపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీనియర్ నాయకురాలు మనెమ్మా, మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, రహీమ్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రాంతి యువజన సంఘం అధ్యక్షుడిగా మహేష్



**పాలకుర్తి, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** పాలకుర్తి మండల కేంద్రం లో శాంతి నగర్ క్రాంతి యూత్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నంగునూరీ మహేష్, గౌరవ అధ్యక్షునిగా పెనుగొండ సోమేశ్వర్,ప్రధాన కార్యదర్శిగా బెల్లి దిలీప్, ఉపాధ్యక్షులుగా సలేంద్ర శంకర్, బొద్దున సందీప్, కోశాధికారిగా కమ్మగాని సుధాకర్, సహాయ కార్యదర్శిగా చిట్యాల సాయి,సలహా కమిటీ గజ్జెల్లి వెంకటేశ్వర్లు, బండి కిరణ్,ఎండీ తయారు,బండి మధు,పెండ్లి శోభన్ బాబు,చిట్యాల మధు,గజ్జి సంతోష్ కుమార్,వంగ అశోక్, సింగా నాగరాజు, బంగ్లా యాకుబ్, జక్కు రాజు, వీరమనేని రాజు, సభ్యులుగా గుళ్ల రమేష్,చిలువేరు గజేందర్,కత్తుల ఆంజనేయులు,బండి హరీష్,కమ్మగాని శ్రవణ్ కుమార్,పెనుగొండ వెంకటేశ్వర్లు, ముతోజు రాము, చిలకమారి శ్రీధర్ ఎన్నికయ్యారు.

## లక్ష్యసాధనకోసం కృషి చేయాలి: ఎస్ఐ సంధ్య

### ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం



**మధిర, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని,విద్యార్థులు తమ లక్ష్య సాధనకోసం కృషిచేయాలని మధిర టౌన్ ఎస్ఐ సంధ్య అన్నారు. ఆదివారం టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 470కి 467 మార్కులతో పాగి శశాంక్, నీట్ ఆల్ ఇండియా 560వ ర్యాంకు సాధించిన దారా ప్రుద్వితేజ్ లు ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంధ్య మాట్లాడుతూ ప్రతిభకు మార్కులు మాత్రమే ప్రామా ణికం కాదని. వారి ప్రతిభకూడా ముఖ్యమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,పాగి శశాంక్ తండ్రి బాలస్వామి,దారా పుద్వి తేజ్ తండ్రి దారా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన పాలకుర్తి జర్నలిస్టులు

### ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేకు వివరణ



**పాలకుర్తి, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను వెలికి తీసి ప్రజలకు వారధిగా నిలుస్తూ ప్రజలతో మమేకమైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అధికారికంగా ఏర్పాటు చేసిన పాలకుర్తి ప్రెస్ క్లబ్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు కెటాయించాలని పాలకుర్తి ప్రెస్ క్లబ్ బృందం ఆదివారం పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డిని తొర్రూరు లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గూడూరు లెనిన్, ప్రధాన కార్యదర్శి చెరిపెల్లి అశోక్ మహర్షిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని అనంతరం స్థానిక సమస్యలపై చర్చించారు. జనగామ జిల్లా కేంద్రంతో పోటీపడుతున్న పాలకుర్తి అన్ని రంగాలలో అభివృద్ధి కి పోటీ పడుతున్న నేపథ్యంలో పాలకుర్తి చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా అందుబాటులో బస్టాండ్ ను పునరుద్దించాలని కోరారు, అలాగే మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. అనేక ఏళ్లుగా జర్నలిస్టులు ప్రజలకు సేవలు అందిస్తున్న తరుణంలో వారికి ప్రెస్ క్లబ్ భవనం తో పాటు స్టల కేటాయింపులు జరిపి భవన నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులను మంజూరీ చేయించవలసిందిగా వారు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ప్రెస్ క్లబ్ సభ్యులు కమ్మగాని నాగన్న, అబ్బోజు యాకస్వామి, గజ్జి సంతోష్ కుమార్,ఎడవల్లి యాకన్న,తోడేటి ఆంజనేయులు,కమ్మగాని నరేష్, గాదపాక కిరణ్, కొత్తకొండ వాసు, తుటి పరశురాములు. వన్నాల ధనుంజయ, బహుజన కులాల ఐక్య వేదిక వ్యస్థాపక అధ్యక్షుడు గుమ్మడిరాజుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



## మహిళా కార్మికులను సంఘటిత పరుద్దాం

- మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబాను కలిసిన బుద్ధారం
- ఐఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్ధారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** మహిళా కార్మికులను కాంగ్రెస్ విభాగంలోకి తీసుకోవాలని ఐఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్ధారం అన్నారు. శనివారం న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్కలాంబను మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్మిక మహిళలను సైతం కాంగ్రెస్ మహిళా విభాగంలోకి తీసుకోవాలని అప్పుడే గ్రామస్థాయిలో మహిళలు బలోపేతం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.ప్రతి జిల్లాలో మహిళా కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన ఆల్కలాంబ తదుపరి కార్యాచరణలో అన్ని విషయాలపై చర్చించి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.కార్యక్ర మంలో ఐఎన్టియుసి (ఎఫ్) జాతీయ అధ్యక్షులు స్వామినాథ్ జైస్వాల్,జాతీయ కార్యదర్శి సాయిబాబా,ఉపాధ్యక్షులు శ్రీనివాసులు,బీర్లపల్లి రాజు,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల మధుసూదన్ రెడ్డి,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రసాద్, నాజా ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో స్టేషన్లలో.. ఫ్రీ పార్కింగ్‌ను శాశ్వతంగా అమలు చేయాలి

**ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద పివైఎల్ నేతృత్వంలో నిరసనలు**




**ఉప్పల్, ఆగస్టు 25(నిఘా న్యూస్):** మెట్రో స్టేషన్ ల వద్ద ఫ్రీ పార్కింగ్ ను నిరంతరం కొనసాగించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ యూత్ లీగ్( పి వై ఎల్ ) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉప్పల్ -నాగోల్ మెట్రో రైలు స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. సామాన్య ప్రజలకు మెట్రో రైలు ప్రయాణ ఛార్జీతో పాటు పార్కింగ్ వంటి ఛార్జీలతో సుమారు రూ.6 వేలు భారం పడుతుందని వారు అవేదన వ్యక్తం చేశారు. ప్రోగ్రెసివ్ యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ మెట్రో స్టేషన్ ల వద్ద ఫ్రీ పార్కింగ్ విధానాన్ని ఏదో ఒక విధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఉద్యోగులకు భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు తాత్కాలిక వాయిదా వేయడం సరి అయింది కాదని అన్నారు. పూర్తి స్థాయిలో ఫ్రీ పార్కింగ్ విధానం కొనసాగించే వరకు తమ ఆందోళన కార్యక్రమం కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రయాణికులు పాల్గొన్నారు. మెట్రో అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## గోల్డ్ మెడల్ సాధించిన కానిస్టేబుల్ దంపతులు



**ఖమ్మం, ఆగస్టు 25(నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఆదివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్లో ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన రేగళ్ల గోపి,బీరెల్లి లక్ష్మి దంపతులు గోల్డ్ మెడల్ సాధించారు. గోపి 42.2 మీటర్ల పరుగు పందెంలో 4.17 నిమిషాల్లో విజయం సాధించగా, లక్ష్మి 21.1 మీటర్ల రేంజ్లో 2.38 నిమిషాల సమయంలో గమ్యం చేరుకుని విజయం సాధించారు. దంపతులిద్దరూ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు.వీరు గతంలో ఎన్నో మరథాన్లలో పాల్గొని విజయం సాధించారు. గోపి గన్ మెన్ గా పని చేస్తుండగా, లక్ష్మి తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ లో రిసెప్షనిస్ట్ గా పని చేస్తుంది. ఈ పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి ఎంతోమంది క్రీడాకారులు పాల్గొన్నారు. మద్దులపల్లి గ్రామానికి చెందిన గోపి దంపతులు గోల్డ్ మెడల్ సాధించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరి విజయం పట్ల గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు అంబటి సుబ్బారావు, సప్పిడి ప్రభాకర్, అంబటి ఈశ్వర్, నల్లపునేని రమణయ్య, నల్లపునేని భాస్కర్ రావు తదితరులు అభినందించారు.

# రాజ్యాంగ స్ఫూర్తితో...
# శాస్త్రీయ ప్రచారాన్ని కొనసాగిద్దాం

**జన విజ్ఞాన వేదిక శ్రీకాకుళం జిల్లా ప్లీనరి సమావేశంలో తీర్మానం**




**శ్రీకాకుళం, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** జన విజ్ఞాన వేదిక శ్రీకాకుళం జిల్లా వార్షిక సమావేశం (ప్లీనం) ఆదివారం శ్రీకాకుళంలోని యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథులుగా హాజరైన ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ కాంగ్రెస్ (ఏ ఐపిఎస్ఎన్ )జాతీయ కార్యవర్గ సభ్యులు గొంటి మురళీధర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 51 ఏ (హెచ్) ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్ మాట్లాడుతూ సైన్స్ ఉద్యమం ద్వారా మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లో మండల కమిటీలు నిర్మించి జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెడుతూ గత సంవత్సర కాలంగా జనవిజ్ఞాన వేదిక చేసిన సైంటిఫిక్ టెంపర్ క్యాంపైను కార్యక్రమాలను వివరించారు. జన విజ్ఞాన వేదిక సబ్ కమిటీలు గా ఉన్న విద్య, ఆరోగ్యం, పర్యావరణం, యువత, సమత, సైన్స్ అండ్ కమ్యూనికేషన్, కల్చరల్, అగ్రికల్చర్, చెకుముకి, సోషల్ మీడియా సబ్ కమిటీలను పూర్తిస్థాయిలో నిర్మించి ఆ సబ్ కమిటీల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రముఖ పాత్రికేయులు బెందాలం కృష్ణారావు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలను తొలగించడానికి ప్రయత్నించాలని కోరారు.

ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ నాయకులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ నూతనంగా వస్తున్న చట్టాలు ఏ విధంగా పర్యావరణ నాశనానికి కారణమో, ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉన్నాయో వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదికతో కలిసి పని చేస్తామన్నారు.గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం జిల్లా అధ్యక్షులు విజీ కే మూర్తి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదికతో కలిసి శాస్త్రీయ దృక్పథ క్యాంపెయిన్‌లో గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం భాగస్వామ్యం అవుతుందని తెలిపారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం జిల్లా అధ్యక్షులు సంపతిరావు శశిభూషణ రావు మాట్లాడుతూ యూనివర్సిటీ, ఇతర ఉన్నత విద్యాసంస్థలలో జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలను నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు.మానవ వికాస వేదిక ప్రతినిధి ప్రముఖ మెజీషియన్ సిహెచ్ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ మూఢనమ్మకాలను తన మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా నిరోధించడానికి జెవివితో కలిసి పని చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో సమత జిల్లా నాయకులు సత్య ప్రభ మాట్లాడుతూ మహిళల్లో విద్యార్థులలో ఉండే అశాస్త్రీయ భావనలను తొలగించేందుకు సమత విభాగం కృషి చేస్తుందన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లారెడ్డి పద్మనాభరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధన రావు,జిల్లా ఉపాధ్యక్షులు ఎం వాగ్దేవి, పి.కూర్మారావు, ఎస్ సంజీవరావు, జిల్లా కోశాధికారి వివిఎస్ కుమార్ జిల్లా కార్యదర్శిలు ఆర్ సురేష్ బాబు, పర్యావరణ కమిటీ కన్వీనర్ పూజారి గోవిందరావు కొకన్వీనర్ చింతాడ అమ్మి నాయుడు, పి.జగదీశ్వరరావు, విద్యా సబ్ కమిటీ కన్వీనర్ పాలవలస ధర్మారావు, కో కన్వీనర్ బొడ్డేపల్లి జగన్నాథరావు, సైన్స్ అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ హనుమంతు మన్మధరావు, యూత్ అండ్ సోషల్ మీడియా కన్వీనర్ అగతమూడి వాసుదేవరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ సామ సంజీవరావు కోకన్వీనర్లు బగాది తేజేశ్వరరావు, చింతాడ రామచంద్రరావు, పైడి రామస్వామి, ఆడిట్ కమిటీ కన్వీనర్ భోగేల ఉమామహేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బీ.ధనలక్ష్మి జిల్లా కార్యదర్శి కార్యదర్శులు జి.సురేష్, స్వర్ణ కుమారి, హెడ్మాస్టర్ పి.శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు జి.బాలకృష్ణ కార్యకర్తలు కూన రమణబాబు, బి.కృష్ణారావు, ఎం.తవిటి బాబు,కే శ్యామలరావు తదితరులు పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు చేశారు.సెప్టెంబర్ నెలలో చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయాలని, శాస్త్రీయ దృక్పథ క్యాంపెయిన్‌ని విజయవంతం చేయాలని సైన్సు ఉద్యమ అభిమానులను సమావేశం కోరింది. మూఢనమ్మకాల నిరోధక చట్టం రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది.

## గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటి విడుదలకు జీవో





**వేసవిలో తీరనున్న సాగునీటి ఇబ్బందులు**
**ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్**

**ముధోల్, ఆగస్టు25 (నిఘా న్యూస్):** ఎమ్మెల్యే చొరవతో అదనంగా సాగు నీరు విడుదల 14వేల ఎకరాలకు అందనున్న సాగు నీరు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చొరవతో గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ ఆయకట్టు దారులకు ఊరట లభించింది. రైతాంగానికి వేసవిలో సాగు నీటికి ఇబ్బందులు కలగ కుండా ప్రభుత్వం జీవోను విడుదల చేసినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేసారు.ప్రాజెక్ట్ కెపాసిటీ 358.7 మి. కాగా ప్రాజెక్టులో 357.5 మి. నీరు నిల్వ ఉంటేనే 2017 జివో ప్రకారం సాగు నీరు విడుదలకు ఆస్కారం ఉండేది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తేవడం జరిగిందన్నారు. ప్రభుత్వం 355.9 మీ. వరకు నీరు ఉన్నప్పటికీ సాగునీరు వాడుకోవచ్చని జివో విడుదల చేయడంతో 0.6టిఎంసిల నీరు అదనంగా వాడుకోవడం వల్ల ఆరు వేల ఎకరాలకు అదనపు సాగు నీరు అందడంతో 14 వేల ఎకరాలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ జివో విడుదల వల్ల ప్రాజెక్ట్ ఎగువ భాగం లో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కుబీర్ మండల రైతులకు సాగు నీరు అందుతుందన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదములు తెలిపారు. విలేకరుల సమావేశంలో బిజెపి తానూర్ మండల అధ్యక్షులు చిన్నా రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా,కౌన్సిలర్ కపిల్, కృష్ణ, బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

## అడవిలోకి చొరబడుతున్న 19మంది అరెస్టు

**మూడు కార్లు,గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం**

**తిరుపతి, అగస్ట్ 25(నిఘా న్యూస్):** తిరుపతి సమీపంలోని నాగపట్ల అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 19 మందిని టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి మూడు కార్లు, 4పిడిలేని ఇనుప గొడ్డళ్లు, ఒక ఇనుప బారీస, 4 ఇనుప రంపాలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.శ్రీనివాస్ అధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన కేఎస్కె లింగాధర్ టీమ్ ఆదివారం కూంబింగ్ చేపట్టింది. ఈ బృందం బాకరాపేట చేరి, అక్కడ నుంచి శ్రీవారిమెట్టు వైపు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వస్తుండగా, చంద్రగిరి మండలం నాగపట్ల అటవీ పరిధిలోని నరసింగాపురం రైల్వే గేటు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో మూడు వాహనాలు కనిపించాయి. వాహనాలను చుట్టుముట్టి తనిఖీ చేస్తుండగా, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కారులో నాలుగు పిడిలేని గొడ్డళ్లు, ఒక ఇనపు బారిస, నాలుగు ఇనుప రంపాలు ఉన్నాయి. వారిని విచారించగా ఎర్రచందనం కోసం అడవిలోకి వెళుతున్నట్లు తెలిసింది. అరెస్టయిన వారిలో తిరుపతి సత్యనారాయణపురంకు చెందిన ఎన్నీ శివ (45), డీ.జానకిరామ్ (36),రైల్వే కోడూరుకు చెందిన నాయని శివ (36), తోట లక్ష్మీపతి (30), కార్వేటి నగరానికి చెందిన ప్రభాకర్ (45), తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన దక్షిణా మూర్తి (29), సినరాజా (49), కుమార్ చిన్నపయ్యన్ (35), తిరుపత్తూరు జిల్లాకు చెందిన రామలింగరాజు (54), పార్తిబన్ కుమార్ (24), స్వామినాథన్ అన్నామలై (38), వాసుమణి (23), ఆర్ రవి (40), ఏ. అన్నామలై (35), కార్తీక్ (42), సేతుమణి (26), శంకర్ (44), కుమార్ రాజా (44), కార్తీక్ (25)లు ఉన్నారు. వీరిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేయగా, సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.



### ఐదు మిల్లులు డిఫాల్టర్ అయితే..
## చర్యలు తీసుకున్నది ఒక్కదానిపైనే

**మూడేళ్లు కావస్తున్నా పట్టించుకోని అధికారులు**

**పెబ్బేరు, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండలంలో 2021-22 వానకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యాన్ని మిల్లర్లు గడువులోగా ప్రభుత్వానికి తిరిగి ఇవ్వడంలో విఫలమయ్యారు. దీంతో మండలంలో 5 మిల్లులు డిఫాల్టర్ అయ్యాయి. ఈ మిల్లులకు 3,096.792 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకు 1,123.668 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టారు. ఇంకా 1,973.124 మెట్రిక్ ధాన్యం ప్రభుత్వానికి బకాయి పడ్డారు. ఇప్పుడు ఈ ధాన్యం మిల్లుల్లోనే ఉందా, లేకపోతే ప్రైవేట్ మార్కెట్‌లోకి తరలిపోయిందా అనేది తేలాల్సి ఉంది. సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా కొందరు మిల్లర్లు వాటితోనే వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ బియ్యాన్ని దొంగదారిలో ధర ఎక్కువగా ఉండే రాష్ట్రాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. మరికొందరు మిల్లర్లు మన ధాన్యాన్ని పక్క రాష్ట్రల్లో అమ్మేసి, అక్కడ తక్కువ ధరకు దొరికే బియ్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారనే గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి.ప్రభుత్వ బియ్యాన్ని దొంగదారిలో ధర ఎక్కువగా ఉండే రాష్ట్రాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. మరికొందరు మిల్లర్లు మన ధాన్యాన్ని పక్క రాష్ట్రల్లో అమ్మేసి, అక్కడ తక్కువ ధరకు దొరికే బియ్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారనే గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ధాన్యంతో మిల్లర్లు వ్యాపారం చేస్తుంటే ఇన్ని రోజులు అధికారులు ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనల ప్రకారం మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ఏడాదిలోగా తిరిగి ఇవ్వాలి. కానీ పలుమార్లు గడువును పెంచుకుంటూ.. మధ్యలో ఓ వానకాలం వెళ్లిపోయి, మళ్లీ వానకాలం (దాదాపు మూడేళ్ళు) వచ్చే వరకు మిల్లర్లకు సమయం ఇచ్చారు. ఇంత చేసినా మిల్లర్లు ధాన్యం తిరిగి ఇవ్వలేక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందే నిబంధనల ప్రకారం ధాన్యం ఇవ్వని వారిపై చర్యలు తీసుకోకుండా, ఇప్పుడు ఏదో హడావుడి చేస్తూ చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు మిల్లర్ల విషయంలో పక్షపాతం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



### మిల్లులపై చర్యలేవి...?

మండలంలో డిఫాల్టరైన మిల్లులు ఐదుగురు ఉంటే, ఒక్క మిల్లర్ (రంగాపురంలోని శివసాయి ట్రేడర్స్ యాజమాని)పైనే క్రిమినల్ కేసు పెట్టి వదిలేశారు. డిఫాల్టరైన అందరినీ వదిలేసి ఒక్కరిపైనే చర్యలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మిల్లును తనిఖీ చేసినప్పుడు ధాన్యం స్టాక్ లేకపోవడంతో క్రిమినల్ కేసు నమోదు చేసిన అధికారులు మిగిలిన మిల్లులను ఎందుకు తనిఖీ చేయడం లేదన్న ప్రశ్న తలెత్తుతున్నది. మిల్లుల్లో స్టాక్ పొజిషన్ ఏమిటో, ఇంకా ఎందుకు నిగ్గు తేల్చడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఏపీ మంత్రిని కలిసిన బీజేపీ నేతలు



**బాలాపూర్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** ఆంధ్ర ప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ ఎల్బీ నగర్ నియోజకవర్గం పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ కి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కోలన్ శంకర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల మధు, చెవ్వ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ పరులను... సమాజానికి పరిచయం చేద్దాం

- సమాచారం ఇవ్వండి సన్మానిద్దాం
- సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్



**హైదరాబాద్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** సమాజంలో నిజాయితీగా పనిచేసిన, పనిచేస్తున్న అధికారుల సమాచారాన్ని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థకు అందించాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సలహాదారులు, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ప్రజలను కోరారు. అదివారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. సమాజంలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతున్నదని, దానిని నిర్మూలించే క్రమంలో నిజాయితీగా పనిచేసే వారిని గుర్తించి సత్కరిస్తూ నేటి తరానికి పరిచయం చేయబోతున్నామని తెలిపారు. మన చుట్టూ ఎంతోమంది నిజాయితీగా పనిచేస్తున్నారనే విషయం చాలా మందికి తెలియదని, అలాంటి వారిని గురించి యువతరానికి స్ఫూర్తిగా నిలిచే బాధ్యతను సంస్థ తీసుకుందన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ దేశంలోనే యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వినూత్న కార్యక్రమాలను చేపడుతుందని, అందులో భాగంగానే నిజాయితీ పరుల సంఖ్యను పెంచే కార్యక్రమం అన్నారు. అవినీతి రహిత సమాజం విడతల వారీగా నిజాయితీ అధికారులను, నాయకులను, సర్పంచులను సత్కరిస్తున్నామన్నారు. సెప్టెంబర్ ఒకటిన నిజాయితీ అధికారుల కార్యక్రమాన్ని హైదరాబాద్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సభ్యులు కొమటి రమేశ్ బాబు, బత్తిని రాజేశ్, జి. హరిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖిల్‌కు రెండో స్థానం



**హైదరాబాద్, ఆగస్టు 25 (నిఘా న్యూస్):** ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ చెన్నైలోని మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో తొలి రోజు నిరాశ పరిచిన హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ఆదివారం జరిగిన ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్ఎల్) మొదటి రౌండ్ రెండో రేసులో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అఖిల్ రవీంద్ర రెండో స్థానంతో రన్నరప్‌గా నిలిచాడని నిర్వాహకులు నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ భారతీయ రేసర్ అయిన అఖిల్ అగ్రస్థానంలో పోటాపోటీగా తలపడ్డాడని, చివరకు 27 నిమిషాల 115.266 సెకన్లలో రేసును పూర్తి చేశాడన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com